


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 20-11-2019 VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 62 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## మద్యం ధర పెంపు!

- బార్ల సంఖ్య 40 శాతానికి తగ్గింపు
- నిబంధనలు అతిక్రమిస్తే జైలుశిక్షే
- మద్యపాన నిషేధంపై సీఎం జగన్ మరో ముందడుగు



అమరావతి : మద్యపాన నిషేధంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందడుగు వేశారు. రాష్ట్రంలో ఉన్న బార్ల సంఖ్యను 40 శాతానికి తగ్గించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. బార్ల పాలసీపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్టార్ హోటళ్ల మినహా ప్రస్తుతం ఉన్న 798 బార్లను 40శాతానికి ప్రభుత్వం తగ్గించనుంది. బార్ల సంఖ్యను 50 శాతానికి తగ్గించాలన్న సీఎం ఆదేశాల నేపథ్యంలో.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 20శాతం మద్యం దుకాణాలను తగ్గించామని, విడతల వారీగా పూర్తిగా తగ్గిస్తామని అధికారులు తెలిపారు. ఇక బార్ల సంఖ్యను కుదించే క్రమంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్కడ మద్యం సరఫరా వేళల్ని కుదించింది. బార్లలో మద్యం సరఫరాకు ఉదయం 11 నుంచి రాత్రి 10 వరకూ, ఆహారం రాత్రి 11 వరకు.. స్టార్ హోటళ్లలో మద్యం అమ్మకాలు.. ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు అనుమతి తరువాయి 2లో..

## మరో ప్రయోగానికి ఇస్రో సై..



బెంగళూరు : వరుస విజయాలతో దూసుకుపోతూ, అంతరిక్ష పరిశోధన రంగంలో భారత పతాక గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్న ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమైంది. చంద్రయాన్ 2 ప్రయోగం చివరి నిమిషంలో విఫలమైనా.. నిరుత్సాహపడకుండా ఈ నెల 25న ఉదయం 9.28 గంటలకు పీఎస్ఎల్వీ సీ47 రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు.

దీనిద్వారా కార్టోశాట్3 ఉపగ్రహంతో పాటు మరో 13 కమర్షియల్ నానో శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. హై రెజల్యూషన్ ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా భూ ఉపరితల చిత్రాలను ఈ శాటిలైట్ తీస్తుంది.

కార్టోశాట్-3 ఉపగ్రహాన్ని 97.5 డిగ్రీల వంపులో 509 కిలోమీటర్ల కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు ఇస్రో చెబుతున్నట్లు అమెరికాకు చెందిన 13 నానో శాటిలైట్లను కూడా నింగిలోకి పంపనున్నారు.

## ఢిల్లీని వణికించిన భూకంపం

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తరాదిని భూకంపం వణికించింది. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం, యూపీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మంగళవారం సాయంత్రం భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.1గా నమోదైంది. ఇండో నేపాల్ సరిహద్దు ప్రాంతం భూకంప కేంద్రంగా నమోదైంది. కాగా భూకంపంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

## వ్యవసాయ విజ్ఞానం గ్రామాలకు చేరాలి

- క్షేత్ర స్థాయిలోకి పరిశోధనా ఫలాలు
- రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం : వ్యవసాయ పరిశోధనా ఫలాలు క్షేత్ర స్థాయికి చేరాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో కిసాన్ మేళా కార్యక్రమం మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్, జిల్లా కలెక్టర్ జె నివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రైతులను ఉద్దేశించి శాసన సభాపతి తమ్మినేని సీతారాం మాట్లాడుతూ వ్యవసాయ విజ్ఞానం గ్రామాలకు చేరాలన్నారు. పరిశోధన ఫలితాలు, సమాచారం రైతులకు అందాలని అప్పుడే వ్యవసాయం మరింత వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సంప్రదాయ వ్యవసాయం శ్రీకాకుళం రైతులు చేస్తున్నారని, జిల్లా రైతులు కష్టపడే తత్వం కలిగిన వారని అన్నారు. జిల్లాలో నాలుగు జీవ నదులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని పంటల దిగుబడిలో గణనీయమైన ప్రగతికి అవకాశం ఉందన్నారు. వంశధార ప్రాజెక్ట్ పూర్తి చేయుటకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని శాసన సభాపతి చెప్పారు. వైయస్ఆర్ పొలం బడికి సరైన రూపం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని గ్రామంలో గల రైతు అనుభవానికి జోడించాలని తద్వారా ఫలితాలు సాధించవచ్చని సూచించారు. వ్యవసాయ విద్యార్థులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అక్కడ రైతులకు అవగాహన కల్పించాలని తరువాయి 2లో..

## 2024కు ఏపీలో మూడు ఏఐఐబీ ప్రాజెక్ట్‌లు



న్యూఢిల్లీ: ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఆర్థిక సహకారంతో రాష్ట్రంలో చేపట్టిన సుమారు 14,252 కోట్ల విలువైన మూడు ప్రాజెక్ట్‌లను 2024 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులను కొనసాగిస్తున్నారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్‌పీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అందరికీ 24 గంటల విద్యుత్ సరఫరా, పట్టణాలలో మెరుగైన మంచినీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, గ్రామీణ రహదారుల నిర్మాణం పేరుతో ఈ మూడు ప్రాజెక్ట్‌లను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 14,252 కోట్ల రూపాయల అంచనాలతో ప్రతిపాదించిన ఈ మూడు ప్రాజెక్ట్‌లకు 7000 కోట్ల రూపాయల వరకు నిధులు సమకూర్చడానికి ఏఐఐబీ ఆమోదం తెలిపింది. 24 గంటల విద్యుత్ సరఫరా ప్రాజెక్ట్ పనుల కింద ఇప్పటి వరకు 224 తరువాయి 2లో..

## శ్రీవారి డిపాజిట్లు..

- ఇక జాతీయ బ్యాంకుల్లోనే
- తొలిదశలో రూ.1400 కోట్లు



తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మరో సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. భక్తులు స్వామి వారికి సమర్పించే కానుకల రూపంలో అందే ఆదాయాన్ని ఇకపై జాతీయ బ్యాంకుల్లో మాత్రమే డిపాజిట్ చేయాలని నిర్ణయించింది. ప్రైవేటు బ్యాంకుల్లో నగదు డిపాజిట్లకు భద్రత ఉండక పోవచ్చనే కారణంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. నిజానికి- ఇదే విషయాన్ని ప్రశ్నిస్తూ కొందరు శ్రీవారి భక్తులు ఇదివరకే న్యాయస్థానాల్లో పిటీషన్లను దాఖలు చేశారు. దీనికి కౌంటర్ ఇస్తూ.. తన తాజా నిర్ణయాన్ని ప్రకటించింది టీటీడీ. కోట్ల రూపాయల ఆదాయం.. కోట్ల రూపాయల ఆదాయం.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల శ్రీవారి ఆలయానికి వచ్చే రోజువారి ఆదాయం కోట్ల రూపాయల్లో ఉంటోంది. ఒక్క హుండీ ద్వారా మాత్రమే రోజూ కనీసం 80 లక్షల రూపాయల ఆదాయం అందుతుంటుంది. బ్రహ్మోత్సవాలు, పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య కోటి నుంచి రెండు కోట్ల రూపాయల వరకు పెరుగుతుంటుంది. దీనితో పాటు లడ్డులు,, దర్శనం టికెట్ల విక్రయాలు, వసతి గదుల అద్దె, బ్యాంకుల్లో నిల్వ ఉంచిన బంగారం, ఇతర నగదుపై వచ్చే వడ్డీ.. ఇవన్నీ లెక్కేసుకుంటే ఏడుకొండలవాడికి వచ్చే ఆదాయం రోజూ కోట్ల రూపాయల్లోనే. ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గు.. ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గు.. ఇంత భారీ ఎత్తున వచ్చే నగదును ఇదివరకు తరువాయి 2లో..

## వాహనదారులకు శుభవార్త

డిసెంబర్ 1 నుంచి ట్రాన్సాక్షన్‌పై క్యాష్‌బ్యాక్

వార్త 8వ పేజీలో..



## అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు

- లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలి
- అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలి
- అవసరమైన ప్రైవేటు భూముల కొనుగోళ్లకు చర్యలు
- జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖ సిటీ: అర్హత ఉన్న ప్రతీ ఒక్క కుటుంబానికి ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అర్హులైన కుటుంబాలను వేగంగా గుర్తించాలని, ఉగాది నాటికి లబ్ధిదారులు అందరికీ ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంత భూమి అవసరం అవుతున్నదీ, ప్రభుత్వ భూమి ఏమేరకు అందుబాటులో ఉన్నది, కొనుగోలుకు అందుబాటులో వున్న ప్రైవేటు భూమి గుర్తించాలన్నారు. వీలైనంతవరకు గ్రామానికి దగ్గరలో, మౌలిక సదుపాయాలకు అందుబాటులో ఉండేవిధంగా భూములను గుర్తించాలన్నారు. భూములను గుర్తించడంతో పాటు లేఅవుట్ లను వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లబ్ధిదారుల విషయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, అర్హులైన ఏ ఒక్కరినీ విడిచి పెట్టకూడదని, అదేవిధంగా అనర్హులు ఎట్టి పరిస్థితుల్లో జాబితాలో ఉండ రాదన్నారు. లబ్ధిదారులు, భూములను గూర్చి రెవెన్యూ డివిజన్ల వారీగా సమీక్షించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎల్ శివ శంకర్, పాడేరు సబ్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎం.శ్రీదేవి, ఆర్డీవో లు పెంచల కిషోర్ సీతారామారావు గోవిందరాజులు, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు జి వి రత్నం, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



# దేవాంగ సంక్షేమానికి అండగా ఉంటా

## ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి : చేనేత కార్మికులకు, దేవాంగ సంక్షేమానికి అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, మాడుగుల శాసనసభ్యులు బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని మామిడి తోటలో మంగళవారం దేవరాపల్లి దేవాంగుల సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బూడి ముత్యాలనాయుడు పాల్గొని వారు ఏర్పాటు చేసిన విందును ఆరగించారు. అనంతరం ఆ సంఘ నాయకులతో మాట మంతి కలిపి, వారితో కొంతసేపు సరదాగా గడిపారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరి, వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వై సి పి నాయకులు కిలపర్తి భాస్కరరావు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, అవుగడ్డ రాంమూర్తి నాయుడు, కోటిపల్లి నాయుడు, బూరె బాబురావు, యెల్లేటి కరుణాకరరావు, చల్లా తతియ్యలు, కె వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవాంగ కార్తీక వన సమారాధన

## ఆకట్టుకున్న దంత వైద్య శిబిరం



అమలాపురం : ఐక్యమత్యంగా అందరూ కలసి ఉండేందుకే వన సమారాధనలు ఉపయోగపడతాయని అమలాపురం దేవాంగ సంఘ అధ్యక్షులు చింతా రామలింగేశ్వరరావు(ప్రకాష్ టైలర్స్) అన్నారు. మంగళవారం స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్‌లో ఘనంగా దేవాంగ కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి అధిక సంఖ్యలో దేవాంగులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని డా. దైవపు సత్య సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత దంత వైద్య శిబిరం ఆకట్టుకుంది. అక్కడకు వచ్చేసిన దేవాంగులు దంత వైద్య శిబిరంలో ఉచిత దంత పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం డా.సునీల్ మాట్లాడుతూ దంంత సంరక్షణ ప్రతీ మనిషికి అత్యంత అవసరమని అన్నారు. దంతాలు పటిష్టంగా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యవంతంగా గుర్తించవచ్చు అన్నారు.

సుమారు వంద మందికి ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితం గా మందులు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో అధిక సంఖ్యలో దేవాంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు ప్రారంభం



దేవరాపల్లి : మండలంలోని ఎస్ సి, ఎస్ టి, బి సి మైనార్టీల కార్పోరేషన్ నుంచి రుణాలు పొందేందుకు మంగళవారం ఇంటర్వ్యూలు ప్రారంభమైయ్యాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ బ్యాంక్ శాఖల అధికారులు లబ్ధిదారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ ఇంటర్వ్యూ లోదేవరాపల్లి ఎస్ బి ఐ పరిధిలో బి సిల నుంచి 319, ఎస్ సి ల నుంచి 48, ఎస్ టి ల నుంచి 105, ఓ సి కాపు 5, వైశాల నుంచి 6, మైనారిటీ నుంచి 1, అలాగే ముస్లిం నుంచి 2దరఖాస్తులు ఆన్ లైన్ లో నమోదు చేయగా వీరిలో కేవలం 200 మంది మాత్రమేహాజరయ్యారు. అలాగే ఏపీజీవీబీ గవరవరం బ్యాంక్ పరిధిలో 72 మంది ఆన్ లైన్ చేయగా కేవలం 36 మంది ఈ ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ పరిపాలన అధికారి జి వి. రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి ఎస్ బి ఐ క్యేస్ ఇంచార్జి ఎం. సురేష్ కుమార్, గవరవరం బ్రాంచ్ మేనేజర్ సి హెచ్. చంద్ర శేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. అప్పలరాజు, జూనియర్ అసిస్టెంట్ కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్ని దాటే సైరా సంబరాలు

విజయనగరంః అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు స్వామినాయుడు పిలుపు మేరకు జిల్లా గౌరవ అధ్యక్షులు ఒమ్మి శ్రీను సారధ్యంలో జిల్లా అధ్యక్షులు రాంకి ఆధ్వర్యంలో స్థానిక ఎన్.సి.ఎస్. దియేటర్‌లో మెగాస్టార్ చిరంజీవి నటించిన " సైరా " 50వ రోజు వేడుకలు ఘనంగా అంబరాన్ని దాటే సైరా సంబరాలు బుదవారం సాయంత్రం గం॥ 6-00 లకు స్థానిక ఎన్.సి.ఎస్.దియేటర్‌లో వేడుకలు జరుగును. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా శ్రీ నారాయణ శ్రీనివాస్ ప్రొప్రైటర్ ఎన్.సి.ఎస్.దియేటర్, జిల్లా మెగా ఫ్యామిలీ అభిమానులు మరియు విజయనగరం ఆల్ సినీస్టార్స్ అభిమానులు, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, సూపర్‌స్టార్ క్రిష్ణ, ప్రభాస్ ప్యాన్స్ ఈ సైరా సంబరాలుకి జిల్లా మెగా అభిమానులు విచ్చేయుదురు.

ఈ కార్యక్రమం జమప్రదం చేసి అదేరోజు సెకెండ్‌షోకి మెగాస్టార్ చిరంజీవి, పవన్, చరణ్, అల్లు అర్జున్ సినిమాలు ప్రత్యేక పాటలు వేయబడును.

మొదటి పేజీ తరువాయి

# వ్యవసాయ విజ్ఞానం గ్రామాలకు చేరాలి

కోరారు. ముందుగా పొలం బడి షెడ్యూల్ గ్రామాలకు ఇవ్వాలని అన్నారు. రైతులకు సరైన అవగాహన కల్పిస్తే ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోగలరని పేర్కొన్నారు. రైతులు నష్టపోకూడదని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పరికరాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వమే సచివాలయాలకు సమీపంలో వ్యవసాయ స్టోర్ లను ఏర్పాటు చేయనుందని చెప్పారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతు నష్టపోతున్నారని, మోసపోతున్నారని పేర్కొంటూ దళారీ వ్యవస్థ పోవాలని అన్నారు. పండించిన పంటలను నిల్వచేసుకునే వ్యవస్థ ఉండాలని చెప్పారు. వ్యవసాయంను ముఖ్యమంత్రి పండగ చేస్తున్నారని కొనియాడారు. రైతులకు అవగాహన కలిగించుటకు శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఏర్పాటు చేయాలని, ఆధునిక యాంత్రీకరణ పద్ధతులు పరిచయం చేయాలని అన్నారు. అత్యాదునిక పరిజ్ఞానాన్ని రైతులు స్వాగతించి అందులో ఫలితాలు అనుభవించాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులపై రైతుకు నమ్మకం కలిగించాలని అప్పుడు రైతు వారిని వదలకుండా అనుసరిస్తాడని అద్భుత ఫలితాలు వస్తాయని సీతారాం అన్నారు.

రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ మాట్లాడుతూ వ్యవసాయ జిల్లా మనది అన్నారు. అవగాహన పెంచుకొని వ్యవసాయం చేయాలని, తద్వారా ఆర్థికంగా ముందంజ వేయాలని అన్నారు. రైతుకు అండగా ముఖ్యమంత్రి. అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయంలో మెలుకువలు పాటించి దిగుబడులు సాధించాలని సూచించారు. అదును పదును చూసి వ్యవసాయం చేయాలని అన్నారు. పరిశోధన ఫలితాలు పరిశీలించి ఆచరించాలని అప్పుడై అనుకున్న ఫలితాలు వస్తాయని చెప్పారు. రాబోయే 5 సంవత్సరాలు వ్యవసాయానికి స్వర్ణయుగం అన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్రంలో రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.4 వేల కోట్లతో ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి ఏర్పాటు చేసారని మంత్రి చెప్పారు.

జిల్లా కలెక్టర్ జె. నివాస్ మాట్లాడుతూ 1010 రకం నిషేధం చేసినపుడు రైతులు సహకరించారన్నారు. జిల్లాలో నాణ్యమైన బియ్యం ఉత్పత్తి చేయుటకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఖరీఫ్ లో 1075 రకం విత్తనాలు సరఫరా చేసామని చెప్పారు. విత్తనాలను రైతులు ఉత్పత్తి చేయాలని పిలుపునిచ్చారు. విత్తనాలకు మంచి ధర వస్తుందని, జిల్లాలో కొరత ఉండదని అన్నారు. రైతుల అనుభవాలు తీసుకొని పరిశోధనలు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. జిల్లాలో ప్రతి ఏటా వరదలు వస్తాయని దానిని పరిగణనలోకి తీసుకొని పరిశోధనలు జరుపుతూ వంగడాలు సృష్టించాలని అన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా సూక్ష్మ పోషకాలు భూమికి అందించి సారాన్ని పెంచాలని అన్నారు. వ్యవసాయానికి మంచి రోజులు వస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలలో వ్యవసాయ సహాయకులను ప్రభుత్వం నియమించిందని వారి సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా.పి.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 13 కిసాన్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు కొత్త వంగడాలు, పరిశోధనల ఫలితాలు తెలిజేయడం కిసాన్ మేళా ఉద్దేశ్యం అని చెప్పారు.

ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఏ.ఎస్.రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 33 వరి పరిశోధన కేంద్రాలు ఉన్నాయన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా వరి వంగడాలు సృష్టించబడతున్నాయని తెలిపారు. గిట్టుబాటు ధర రైతుకు దక్కుటకు యాంత్రీకరణపై పరిశోధనలు చేస్తున్నామని చెప్పారు.

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. జమున మాట్లాడుతూ భవిష్యత్తులో శ్రీకాకుళం రైస్ బౌల్ అవుతుందన్నారు. 2.10 లక్షల హెక్టార్లలో వరి పంట జిల్లాలో ఉందని చెప్పారు. నీటిలో మునిగే అవకాశం ఉన్న భూములు, మెట్టు, నీటి లభ్యత గల భూముల పరిస్థితికి అనుగుణంగా విత్తనాలు ఎంపిక చేసుకోవాలని తద్వారా దిగుబడులకు సమస్య ఉండదని చెప్పారు.

వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె. వి. రమణ మూర్తి మాట్లాడుతూ 1966లో ఏ ఆర్ సి స్థాపన జరిగిందన్నారు. కేంద్రం 10 రకాల మంచి విత్తనాలు అందిందని చెప్పారు. మరిన్ని మంచి రకాలు వస్తున్నాయని ఆయన చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభిస్తున్నామని పేర్కొన్నారు. కాండం తొలిచే పురుగు తదితరాలపై పరిశోధనలు చేస్తామని తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కలిగించు నృత్య ప్రదర్శనలు నిర్వహించి అలరించారు. వ్యవసాయ రంగానికి అవసరమైన కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను పరిశీలించారు. కిసాన్ మేళాలో రైతులకు నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన రైతులకు బహుమతులు అందజేసారు.

ఈ కిసాన్ మేళాలో వ్యవసాయ మిషన్ సభ్యులు గొండు రఘురామ్, నైరా అసోసియేట్ డీన్ ఏ వి రమణ, వ్యవసాయ శాఖ జెడి కె. శ్రీధర్, ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్తలు చిట్టిబాబు, చిన్నం నాయుడు, సురేష్, గొండు కృష్ణ మూర్తి, చిరంజీవి నాగ్, చిట్టి జనార్ధన రావు, రైతులు, సంబంధించిన శాఖల అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, నైరా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం ధర పెంపు!

అనుమతి ఉంటుంది. దీంతోపాటు మద్యం ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

మద్యం కల్తీకు పాల్పడినా, స్మగ్లింగ్ చేసినా, నాటుసారా తయారు చేసినా కఠిన చర్యలు ఉంటాయని, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. లైసెన్స్ ఫీజుకు 3 రెట్లు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మద్యం, ఇసుక విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా వచ్చేఅసెంబ్లీ సమావేశాల్లో చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

నిబంధనలు అతిక్రమిస్తే..

రాష్ట్రంలో 40 శాతం బార్లను తగ్గిస్తున్నామని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడున్న బార్లు మొత్తం తీసేస్తామని, కొత్తగా 40 శాతం తగ్గించి బార్లకు అనుమతులు ఇస్తాం.

మద్యపాన నిషేధం అమలులో భాగంగా బార్లు తగ్గిస్తున్నాం. వాటి టైమింగ్స్ కూడా మార్చాం. బార్లలో మద్యం ధరలను కూడా పెంచుతాం. లాటరీ పద్ధతిలో బార్ల ను కేటాయిస్తాం. బార్ల పాలసీలో నిబంధనలు అతిక్రమించేవారికి జైలు శిక్ష వేసేలా చర్యలు తీసుకుంటున్నాంఅన్నారు.

## 2024కు ఏపీలో మూడు ఏఐఐబీ ప్రాజెక్ట్‌లు

కోట్లు, గ్రామీణ రహదారుల ప్రాజెక్ట్ పనుల కింది 221 కోట్లు, పట్టణాలలో మెరుగైన మంచినీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థ ప్రాజెక్ట్ కోసం 7 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు మంత్రి థాకూర్ చెప్పారు. ఈ మూడు ప్రాజెక్ట్‌ల కోసం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 24 గంటలు విద్యుత్ సరఫరా ప్రాజెక్ట్ 2022 నవంబర్ నాటికి, మిగిలిన రెండు ప్రాజెక్ట్‌లు 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

సీఎస్ఆర్ నిధులను ఫండ్‌లో జమ చేయాలి

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద కేటాయించే నిధులను ఏదైనా పరిశ్రమ ఆర్థిక సంవత్సరం ముగిసిలోగా ఖర్చు చేయని పక్షంలో ఆ నిధులను నెల రోజుల వ్యవధిలో ఏదైనా బ్యాంక్‌లో ప్రత్యేకంగా అకౌంట్ తెరిచి అందులో జమ చేయాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ థాకూర్ చెప్పారు. రాజ్యసభలో మంగళవారం వి.విజయసాయి రెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ మూడేళ్ళపాటు ఖర్చు చేయకుండా ఆ అకౌంట్‌లో మిగిలి ఉన్న సొమ్మును తృతీయ ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల రోజుల్లో చట్టబద్దంగా ఏర్పాటు చేసిన ఫండ్‌కు బదలాయించాల్సి ఉంటుందని తెలిపారు.

## శ్రీవారి డిపాజిట్లు..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు పుట్టా మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటైన పాలక మండలి.. ప్రైవేటు బ్యాంకుల్లో కూడా భద్ర పరచాలని నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు బ్యాంకుల్లో వడ్డీ రేట్లు అధికంగా ఉంటాయనే ఒకే ఒక్క కారణాన్ని చూపింది. వందల కోట్ల రూపాయలను ప్రైవేటు బ్యాంకుల్లో కూడా ఫిక్స్డ డిపాజిట్ చేయాలని తీర్మానించింది.

హైకోర్టులో పిటీషన్..

నాటి పాలక మండలి నిర్ణయాన్ని నిరసిస్తూ కొందరు భక్తులు అప్పట్లో హైకోర్టులో పిటీషన్ ను దాఖలు చేశారు. జాతీయ బ్యాంకులు ఉండగా.. టీటీడీ పాలక మండలి సభ్యులు ప్రైవేటు బ్యాంకుల్లో ఫిక్స్డ డిపాజిట్ చేయడం పట్ల తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రస్తుతం వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన పాలక మండలికి నోటీసులను జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

వెనక్కి తీసుకుంటామంటూ..

దీనిపై స్పందించిన టీటీడీ పాలక మండలి.. తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేసింది. ప్రైవేటు బ్యాంకులకు బదులుగా జాతీయ బ్యాంకుల్లోనే శ్రీవారి ఆదాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో భద్ర పరుస్తామని వెల్లడించింది. తొలిదశలో 1400 కోట్ల రూపాయల మొత్తాన్ని జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేస్తామని పేర్కొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గు చూపబోమని టీటీడీ పాలక మండలి ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించింది.

# ఆంగ్ల మాధ్యమాన్ని ఎందుకు విమర్శిస్తున్నారు?

## భావితరాల భవితకు ఆంగ్లమాధ్యమం ముందడుగు



విజయనగరంః దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు నిత్యం విమర్శించడాన్ని వైయస్‌ఆర్ కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందని సాలూరు ఎమ్మెల్యే, వై.సి.పి.రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రాజన్నదొర పేర్కొన్నారు.

మంగళవారం గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో జరిగిన విలేఖరుల సమావేశములో ఆయన మాట్లాడారు. భాషకి, మతానికి ముడుపెట్టి వారు మాట్లాడం హేయమైనదని ఆయన అన్నారు.సర్వమతాలు, కులాల సంగమమే భారత దేశం అన్న విషయాన్ని వారు మరచి మాట్లాడుతున్నారన్నారు.

గజపతినగరం శాసన సభ్యులు బొత్స అప్పలనర్సయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నందున ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మూడుసార్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఓర్వలేక పోతున్నారన్నారు.

బొబ్బిలి ఎమ్మెల్యే శంభంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషుమీడియం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని ప్రజలు హర్షిస్తుంటే ప్రతిపక్ష పార్టీల నేతలకు కడుపు మంటగా ఉందన్నారు.

పార్వతీపురం శాసనసభ్యులు అలజంగి జోగారావు మాట్లాడుతూ, అవినీతి రహితంగా లక్షా నలబైవేల సచివాలయ ఉద్యోగాలు ఎందరో నిరుద్యోగులకు జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి కల్పిస్తే దానిని కూడా చంద్రబాబు రాజకీయం చేయడం తగదన్నారు. బడుగులకు జగన్‌మోమన్‌రెడ్డి అండగా ఉంటూ పలు సంక్షేమ పథకాలు అమలు చేయడాన్ని చంద్రబాబునాయుడు ఓర్వలేక పోతున్నారన్నారు.

సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న , వైకాపా నాయకులు ఎమ్.ఎల్.ఎన్.రాజులు పాల్గొన్నారు

# సున్నా వడ్డీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గొలుగొండః ప్రభుత్వం అందజేస్తున్న సున్న వడ్డీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ వెలుగు ఎపిఎం గోవిందరావు అన్నారు. గొలుగొండలో విఒఎలు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం గోవిందరావు మాట్లాడుతూ గొలుగొండ మండలంకు 998 సంఘాలకు 74లక్షలు మంజూరు అయిందన్నారు. రుణాలు తీసుకున్న వారు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు కుమారి, విఒఎలు పాల్గొన్నారు.

# ఆదిత్యలో గ్రంధాలయ వారోత్సవాలు

## ప్రారంభించిన ఆదిత్య అధినేత డా.శేషారెడ్డి



గండేపల్లిః సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల వివిధ కళాశాలలకు చెందిన గ్రంధాలయ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ గ్రంధాలయ వారోత్సవవేడుకలలో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఘనంగా ప్రారంభమైనది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆదిత్య విద్యాసంస్థల అధినేత డా.నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొని రిబ్బన్ కత్తిరించి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.ఈకార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం. శ్రీనివాస రెడ్డి, డా.టి.కె.రామకృష్ణారావు, డా.ఆదిరెడ్డి రమేష్, గ్రంధాలయాధికారి కె.అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకే కాకుండా ప్రతి ఒక్కరికి పుస్తకం మంచి నేస్తం అని విద్యార్థులకు పాఠ్యాంశాలతో కూడిన పుస్తకాలనే కాకుండా ప్రముఖ రచయితలు వ్రాసిన జీవిత చరిత్రలు, కథలు, ప్రముఖుల, జాతీయ నాయకుల జీవిత విశేషాలతో కూడిన గ్రంధాలను, నవలలను ప్రదర్శనలో ఉంచడం, రాయితీ కల్పించి అమ్మకానికి ఉంచడం అనేది ఒక చక్కటి ప్రయత్నమని ఇందుకు సహకరించిన "పారామౌంట్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్" ప్రొప్రయిటర్ వెంకట్ విశాఖపట్నం వారికి అభినందనలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమాలలో ప్రాంగణంలో గల వివిధ కళాశాలలకు చెందిన గ్రంధాలయ సిబ్బంది వేణు, వెంకటరమణ, భూదేవి, జ్యోతి, చింతయ్య, సత్యనారాయణ, రవి, సోమరాజు, నాగబాబు, "పారామౌంట్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్యామ్‌కు పోలీసు యంత్రాంగం అభినందన



కాకినాడః శ్యామ్ ఇనిస్ట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్‌ను జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ప్రపంచ రోడ్డు ప్రమాద బాధితుల సంస్మరణ దినం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను జిల్లా ఎస్పీ నయీమ్ హజ్మీ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు సత్కరించారు.సోమవారం ఎస్పీకార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తూ పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్‌ను పోలీస్ అధికారులు సత్కరించారు. పోలీస్ సంస్మరణ దినోత్సవంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్న శ్యామ్ పలువురికి ఆదర్శంగా నిలుస్తారని జిల్లా ఎస్పీ నయీమ్ హజ్మీ కొనియాడారు. పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా ఎంతో మందిని పోలీసులుగా తీర్చిదిద్దడం అభినందనీయం అన్నారు.ఎంతో క్రమశిక్షణతో ఇనిస్టిట్యూట్‌ను నిర్వహిస్తూ తన విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు శ్యామ్ కృషి మరువలేని దని కొనియాడారు.ఇప్పటి వరకూ వేలాది మంది ని ఎస్ఐలుగా, కానిస్టేబుల్స్‌గా శ్యామ్ తీర్చిదిద్దారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ డిఎస్పీకుమార్, క్రైం డిఎస్పీ వి.భీమారావు, ఎస్‌బి డిఎస్పీలు మురళీకృష్ణ,ఎం.అంబికా ప్రసాద్, ఎస్.ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వివేకాన్ని పెంచే విద్య నేటి ముఖ్య అవసరం

**ఇగ్నో 34 వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్య అతిది కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డా. జి. అర్జున,**
**విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో ఘనంగా జరిగిన వేడుకలు**
**వివిధ పోటీలలో నెగ్గిన విద్యార్థులకు బహుమతి ప్రదానం**

విశాఖపట్నం: విద్య అనేది కేవలం ఉద్యోగాలు చేయడానికో, సర్టిఫికేట్లు పొందడానికో కాక, జ్ఞానాన్ని, వివేకాన్ని కూడా పెంచేదిగా ఉండాలని కె,జి,హెచ్., మెడికల్ సూపరింటెండెంట్ దా. జి. అర్జున అన్నారు. ఈరోజు విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో జరిగిన ఇందిరాగాధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 34వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన విద్యార్థులు, ఉద్యోగుల నుద్దేశించి ప్రసంగించారు. మనం చదివే చదువు మనకు ఉపాధినివ్వడం మాత్రమే కాక, మన చుట్టూ ఉన్న సమాజంలో తలెత్తుకు తిరిగే విధంగా ఆత్మ స్థైర్యాన్ని, మనో బలాన్ని ఇవ్వాలని, ఇగ్నో వంటి ప్రభుత్వ దూరవిద్యా సంస్థలే ఇకముందు ఉన్నత విద్యనందించడంలో ముఖ్య భూమిక వహిస్తాయని, ప్రస్తుతం వేగంగా మారుతున్న సమాజంలో, అతి వేగంగా మారుతున్న మార్కెట్ అవసరాలకు సరిపడే ఉన్నత విద్యనందించడం దూరవిద్యా విధానంతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఉత్తరాంధ్రలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు నైపుణ్యాధారిత కోర్సులు అందించడంలో ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. ఎస్. రాజారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, భారత పూర్వ ప్రధాని, భారత రత్న శ్రీమతి ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు వివిధ ఇగ్నో కార్యకలాపాలు, కార్యక్రమాలు, అధ్యయన సామగ్రి వివరాలతో కూడిన ప్రదర్శన ప్రారంభమయింది.

తరువాత జరిగిన కార్యక్రమంలో సభకు అధ్యక్షత వహించిన డా.ఎస్. రాజారావు ముందుగా ఈ కార్యక్రమ ప్రాశస్త్యం, ప్రాంతీయ కేంద్ర కార్యకలాపాల వివరాలు సభకు అందించారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇగ్నో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, ధృవపత్రాలు ముఖ్య అతిథి చేతులమీదుగా అందించారు.

ఇగ్నో సహాయ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ. ఏ.ఎల్.పి. రావు, సహాయ రిజిస్ట్రార్, ఇగ్నో ఉద్యోగులు, ఇగ్నో అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు, ఇగ్నో విద్యార్థులు, పోటీలలో గెలుపొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆ బాలుడు మళ్లి తప్పిపోయాడు



అనకాపల్లి: ఇంతకు ముందు ఒకసారి అదృశ్యమై పోలీసు చొరవ తో ఇంటికి చేరిన ఆ బాలుడు మళ్లి తప్పి పోయాడు. వివరాల లోకి వెళితే పట్టణంలోని చిన్న రామ రాజు పేట కు చెందిన దాసరి ప్రసాద్ నాయుడు ప్రైవేట్ ఎగ్జిబిషన్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాయుడుకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. దాసరి దుర్గాప్రసాద్(9) గొల్లపాలెం ఎంపిపి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. గత నెల 28వ తేదీన ఇంటి నుండి పాఠశాలకు బయలుదేరిన దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకోక పోవడంతో కలవరపడిన నాయుడు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువులు ఇంటి లో వెతికిన ఫలితం లేకపోవడంతో మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్ఐ చక్రధర్ తెలిపారు. గతంలో కూడా ఈ బాలుడు ఇలానే అదృశ్యమైతే బ్లూ కాట్స్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టుకొని క్షేమంగా ఇంటికి చేర్చినట్లు తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చక్రధర్ తెలిపారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**
కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఎస్ఇఆర్/19-20/104**

1. ఎన్‌డి (వి) - మిలన్ 2020 వద్ద ఫెర్రింగ్ మెన్ మరియు మెటీరియల్ కోసం పరికరాలున్న సివిల్ బోట్ల సేవలను తీసుకోవటానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా డిజిటల్ సీల్డ్ టెండర్లు హ్వానిస్తున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: WWW.DEFPROC.GOV.IN నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 2,50,000/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. **ప్రి-బిడ్డు సమావేశం:** ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 26 నవంబరు 19/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.

4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి **07 డిసెంబరు 19 (1830 గం.లు)** లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0193/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**


# శ్రీనివాసులు రెడ్డికి వర్సిటీ డాక్టరేట్

**ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి**



విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంవ విద్యా విభాగం పరిశోధక విద్యార్థి కర్నాటి వి. శ్రీనివాసులు రెడ్డికి వర్సిటీ డాక్టరేట్ లభించింది. విద్యా విభాగం ఆచార్యులు నిమ్మ వెంకట రావు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ రాజీవ్ విద్య మిషన్(ఎస్ఎస్ఏ) ప్రోగ్రామ్ ఆన్ ఇంపార్టింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శ్రీనివాసులు రెడ్డికి ఉత్తర్వులు అందజేసి అభినందించారు. నాణ్యమైన విద్యను అందించడంలో రాజీవ్ విద్య మిషన్ కార్యక్రమాల భూమికను తన పరిశోధనలో భాగంగా శ్రీనివాసులు రెడ్డి అధ్యయనం చేశారు. ఉపాధ్యాయులకు మరింత మెరుగైన శిక్షణ అందించాలని, తల్లి దండ్రులు పాఠశాల విద్యా కార్యక్రమాలలో మరింత భాగస్వామ్యం కావాలని తన పరిశోధలో వివరించారు. పాఠశాల విద్య అధికారులు పర్యవేక్షణ మరింత పెరగాలని సూచించారు. తద్వారా గుణాత్మక విద్యను సాధించే మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాసులు రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఓఎస్‌డిగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డిని విభాగ ఆచార్యులు, పరిశోధకులు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, బిఓఎస్ చైర్మన్ ఆచార్య టి.షారోన్ రాజు, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రీడింగ్ పాయింట్స్ లేకుండా చూడండి


## - కమిషనర్ డా॥ జి. సృజన






విశాఖపట్నం: నగరంలో బ్రీడింగ్ పాయింట్స్ లేకుండా చూడాలని జి.వి.ఎం.సి. కమిషనర్ డా॥ జి. సృజన పేర్కొన్నారు. ఐదవ జోన్ గాజువాకలో పెదగంట్యాడ, నడుపూరులో పర్యటించి డెంగ్యూ బాధితుల కుటుంబాలను మంగళవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దోమల ఉత్పత్తి, నివారణకు విస్తృతంగా, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. నీరు నిల్వ లేకుండా మూడురోజులకు ఒకసారి డ్రై డే పాటించడం ద్వారా డెంగూ నివారణకు దోహదపడాలని కోరారు. మలేరియా బృందాలు అన్ని గృహాలను సందర్శించి స్టెన్సిలింగ్ చేయాలని కోరారు. వార్డు సెక్రెటరీలు శానిటేషన్, డెంగూ తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతం, అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. పందుల సమస్య ఉందని కాలనీవాసులు తెలుపగా పందుల యజమానులకు నోటీసు ఇవ్వాలని, అప్పటికీ స్పందన లేకపోతే ఫైరింగ్ ద్వారా పందులను నివారించే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ డి.శ్రీధర్‌ను ఆదేశించారు. వీధి దీపాలు అర్ధరాత్రి వెలగడం లేదని తెలపగా చర్యలు తీసుకోవాలని ఇ.ఇ. వేణుగోపాలరావును ఆదేశించారు. ప్రజలు వారి ఇల్లు, పరిసరాలు మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విశాఖకు దోహదపడాలని కోరారు. పర్యటనలో జోనల్ కమిషనర్ డి.శ్రీధర్, ఇ.ఇ. వేణుగోపాల్, మురళీకృష్ణ, ఎఎంఓహెచ్ డా॥ లక్ష్మితులసి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.నరసింహారావు, వార్డు స్పెషల్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ ప్రసాద్, వార్డు సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై సునిశిత పరిశీలన అవసరం




విశాఖపట్నం: సామాజిక అంశాలపై సునిశిత పరిశీలన అవసరం అని ఆంధ్రాయూనివర్సిటీ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ చైర్మన్, మాజీ ఉపకులపతి ఆచార్య బీల సత్యనారాయణ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వర్సిటీలోని ప్లాటినం జూబ్లీ అతిథి గృహంలో డాక్టర్ వివిఎస్.కృష్ణా లైబ్రరీ ఆధ్వర్యంలో జె-గేట్ అంశంపై ప్రత్యేక వర్కుషాప్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆచార్య బీల సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. పరిశోధకులకు సాహిత్యాన్వేషణలో జే-గేట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నాణ్యమైన, సమాజ ఉపయుక్తమైన పరిశోధనలు మరిన్ని వస్తేనే దేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. యూనివర్సిటీల స్థాయిలో పరిశోధనలు మరింత బలపడాలని కోరారు. ఇన్ఫర్‌మేటిక్స్ (బెంగుళూరు ) టెక్నికల్ ఎక్స్‌పర్ట్ రవిశంకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అంటూ ప్రపంచ మొత్తం పరిశోధకుల చెంత ఉందన్నారు. తమకు అనువైన, అవసరమైన అంశాలపై విస్తృత అధ్యయనం చేసే అవకాశం కలగడం అదృష్టం అన్నారు. నిపుణత కలిగిన పరిశోధకులకు దేశంలో అపారమైన ఉపాధి అవకాశాలున్నట్టు చెప్పారు. యువత పరిశోధనా రంగాలపై మరింత మక్కువ పెంచుకోవాలని సూచించారు. డాక్టర్ వివిఎస్.కృష్ణా లైబ్రరీ గౌరవ లైబ్రేరియన్ ఆచార్య కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పరిశోధకులు, ఆచార్యులకు ఎంతో ఉపయుక్తమైన వివిధ సాంకేతిక అంశాలపై ప్రత్యేక వర్కుషాప్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంత నగరంలో కలకలం



మధురవాడ, ప్రశాంత నగరంలో ప్రశాంత్ వ్యవహారం నగరవాసుల్లో కలకలం రేపింది. నేరం ఎలాంటిదైనా దాని మూలాలు ఏదో ఒకటి మధురవాడ తో ముడి పడుతూనే ఉన్నాయి విచిత్రంగా ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఉగ్ర కార్యకలాపాల ప్రయత్నానికి పాల్పడ్డాడంటూ విశాఖకు చెందిన యువకుడు పై పాకిస్తాన్లో ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో మధురవాడ మిధిలాపురి వుడా కాలనీ తో సహ నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికులు కాలనీవాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, శ్రీకాకుళం జిల్లా రాజాం సమీపంలో కంచరాంనకు చెందిన మైనం బాబురావు 63 ఉద్యోగరీత్యా విశాఖ లోని ఐదవ వార్డు పరిధిలో రెవెన్యూ కాలనీలో ఐదేళ్ల క్రితం గంగ రెసిడెన్సీ ఫ్లాట్ నెంబర్ 501 లో నివాసం ఏర్పరుచుకున్నాడు, కుమారుడు ప్రశాంత్ కుమార్ 30 కొమ్మాది శ్రీ చైతన్య లో బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్ సిటీలో ఓ ప్రైవేట్ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం రావడంతో కుటుంబసమేతంగా హైదరాబాద్ పయనమయ్యాడు అక్కడ పనిచేస్తుండగా సోషల్ మీడియా ద్వారా పరిచయమైన యువతిని ప్రేమించాడు, ఎప్పటిలాగే విధుల నిమిత్తం వెళ్ళిన ప్రశాంత్ కుమార్ కనబడుటలేదని ఏప్రిల్ 11 2017 న మాదాపూర్ పోలీసులకు తండ్రి బాబురావు ఫిర్యాదు చేసాడు కట్ చేస్తే సోమవారం రాత్రి పాకిస్తాన్ పోలీసులు ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారన్న వార్త తల్లిదండ్రులతో పాటు యావత్ భారత దేశాన్ని కుదిపేసింది, మంగళవారం ఉదయం నుంచి మధురవాడ ప్రాంతం వుడా కాలనీవాసుల్లోను ఆందోళన మొదలైంది తమకు తెలిసిన ప్రశాంత్ కుమార్ అలాంటి వ్యక్తి కాదని అందరితో చాలా సరదాగా మెలిగే వాడని ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రశాంత్ ను పాకిస్తాన్ నుంచి విడిపించి భారతదేశానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు ఈ వయసులో ప్రశాంత్ తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోవడం వల్లే ఇలా జరిగి ఉండొచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు.




# పథకాలకు అర్హులను గుర్తించడం వాలంటీర్ల బాధ్యత




గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో వాలంటీర్లు పూర్తి బాధ్యత వహించాలని 62వ వార్డు వైకాపా అధ్యక్షుడు బొడ్డు నరశింహపాత్రుడు(కేబుల్‌మూర్తి) అన్నారు. దల్లివానిపాలెం వార్డు సచివాలయంలో మంగళవారం నవశకం కార్యక్రమంపై వాలంటీర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ అర్హులను గుర్తించడంతో పాటు వాలతంటీర్ల వారి వారి ప్రాంతాల్లోని కుటుంబాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. పథకాలను ఎలా సద్వినియోగించుకోవాలో వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుసిడి సిడిఓ సూర్యనారాయణ, వార్డు వైకాపా నాయకులు వరప్రసాద్‌రెడ్డి, రామన్‌రెడ్డి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# 52వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



పెద్దాపురం: 52వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా పెద్దాపురం శాఖ గ్రంధాలయం నందు మహిళా దినోత్సవం ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మున్సిపల్ స్కూల్ హెచ్ఎం చేతుల మీద శివ జ్యోతికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెన్న సుమతి దేవి రికార్డ్ అసిస్టెంట్ మీ ప్రవీణ్ కే పార్వతి కుమారి ఇ ఎస్ అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్ధినులకు రంగవల్లిక పోటీలు

నర్సీపట్నం: 52వ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా బాలికల హైస్కూల్ విద్యార్థినులకు మంగళవారం రంగవల్లికలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శాఖా గ్రంధాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ ప్రముఖులకు ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంధాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ ఈ నెల 20న ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

# ఏయు అంతర కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ సమత కళాశాలలో ప్రారంభం



విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటి అంతర్ కళాశాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సమత కళాశాలలో ప్రారంభమయ్యాయి . ఈ కార్యక్రమానికి ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ వి కృష్ణమోహన్ విచ్చేసి పోటీలను ప్రారంభించారు . అనంతరం కృష్ణమోహన్ గారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని వీలైనంత వరకు అందరు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు . అనంతరం ఏయు ఫిజికల్ డైరెక్టర్ విజయ మోహన్ మాట్లాడుతూ సమత కళాశాల క్రీడలను ఎక్కువగా ప్రోత్సహిస్తుందని, పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. సుమారుగా 20 జట్లు బాలురు బాలికల విభాగంలో తలపడనున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎస్ .విజయ రవీంద్ర గారు డైరెక్టర్ డాక్టర్. జి .శ్రీనివాసరావు గారు పి.డి జీ వెంకటేశ్వరరావు గారు వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు మరియుకళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## టర్మినేటర్‌కే పట్టం

మాజీ రక్షణ కార్యదర్శిగా అత్యంత కఠినుడిగా, టర్మినేటర్‌గా ప్రసిద్ధికెక్కిన గోటబయ రాజపక్స శ్రీలంక ఎన్నికల్లో విజయం సాధించి అధ్యక్షుడిగా సోమవారం పదవీ స్వీకారం చేశారు. దీంతో శ్రీలంక మళ్ళా నిరంకుశ పాలనవైపు పయనిస్తున్నదా అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గోటబయ సోదరుడు మహింద రాజపక్స దేశాధ్యక్షుడిగా ఉన్నప్పుడు గోటబయ రక్షణ కార్యదర్శిగా వ్యవహరించారు. తమిళ టైగర్లను అణిచివేయడంతో సింహళ ప్రజల్లో వీరి ప్రాబల్యం పెరిగింది. అయితే తమిళ టైగర్లను అణిచివేసిన మహింద రాజపక్స నిరంకుశ స్వభావం ఆ తర్వాతకాలంలో బయటపడ్డది. ఆయన అణిచివేత చర్యలు సింహళులను ఊపిరాడకుండా చేశాయి. అధికారులను, పోలీసులను, పార్టీ కేడర్‌ను చేతిలో పట్టుకొని ముఠాపాలన నడిపారనే ఆరోపణలు మహింద రాజపక్సపై ఉన్నాయి. దీంతో మిగతా రాజకీయశక్తులన్నీ ఏకతాటిపైకి వచ్చి 2015లో ఆయనను ఓడించాయి. మైనారిటీలే కాకుండా ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్న శక్తులన్నీ కొత్త రాజకీయ సంఘటనను ఆహ్వానించాయి. కానీ దేశాధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, ప్రధాని రణిల్ విక్రమ సింఘే కలహాలకు దిగి సమర్థవంతమైన పాలన అందించలేకపోయారు. పరిపాలనారంగంలో అవినీతి పెరిగిపోయింది, ఆర్థికరంగం దెబ్బతిన్నది. ఈస్టర్ సండే బాంబు పేలుళ్ళ మూలంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సింహళీయుల్లో ఆగ్రహం, ఆందోళన చోటుచేసుకున్నది. ఈ పరిణామాలన్నీ మహింద సోదరుడు గోటబయ రాజపక్స దేశాధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి దోహదపడ్డాయి. దేశాధ్యక్షుడిగా ఎన్నికైన గోటబయ రాజపక్స ముందు అనేక సవాళ్ళున్నాయి. దేశ భద్రత, ఆర్థికపురోగతి అనే నినాదాలతో ఆయన అధికారానికి వచ్చారు. అప్పుల్లో కూరుకుపోయిన దేశా న్ని చక్కదిద్దడం అంత సులభం కాదు. పేదరి కం, నిరుద్యోగం, గ్రామీణ సంక్షోభం మూలంగా ప్రజల్లో అసంతృప్తి పేరుకుపోయింది. గ్రామీణ ప్రజలు, దిగువ మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా రాజపక్సకు మద్దతు ఇచ్చారు. రాజపక్సకు సిం హళీయులు భారీగా ఓటేశారే తప్ప ఉత్తరాన గల తమిళులు, ముస్లింలు మద్దతు లేదు. అయినప్పటికీ తాను అందరికీ అధ్యక్షుడినని ఒకమాట మాత్రం అన్నారు. తమిళ సమాజ హృదయం గాయపడి ఉన్నది. ఇటీవలి పేలుళ్ల తర్వాత సిం హళ అతివాదులు పేట్రేగే ప్రమాదం ఏర్పడ్డది. ముస్లింలలో భయాందోళనలున్నాయి. జాతుల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడం గోటబయ రాజపక్స ముందున్న పెద్ద సవాలు. సింహళ అతివాద పోకడలనే ఆయన ఆశ్రయిస్తే శ్రీలంక మళ్ళా అస్థిరత్వం పాలవుతుంది. తన సోదరుడు మహింద రాజపక్స కఠిన విధానాలను అనుసరించకూడదు. ఆ కఠిన విధానాలు మెజారిటీ సింహళీయులకు కూడా ఆగ్రహం కలిగించి గత ఎన్నికల్లో ఆయన పరాజాయానికి దారితీశాయి. గతేడాది జరిగిన స్థానిక ఎన్నికలలోనే రాజపక్స పార్టీ బలాన్ని నిరూపించుకున్నది. ప్రతిపక్షాల అనైక్యత కూడా రాజపక్స విజయానికి తోడ్పడ్డది. రాజపక్స వ్యతిరేకతతో గతంలో అధికారానికి వచ్చిన రాజకీయపక్షాలు రాజ్యాంగ సంస్కరణలను చేపట్టకపోవడం పెద్ద తప్పు. దేశాధ్యక్షుడి అధికారాలు తగ్గించి పార్లమెంట్‌ను బలోపేతం చేయాల్సింది. ఇప్పటికైనా జాత్యహంకార, నిరంకుశ రాజకీయాలను వ్యతిరేకించే ప్రజాస్వామ్యశక్తులు ఏకతాటిపైకి వస్తే పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించవచ్చు. దీనివల్ల రాజపక్స నిరంకుశ విధానాలను అనుసరిస్తే కట్టడి చేయడానికి అవకాశం ఉంటుంది. మహింద రాజపక్స చైనాకు అనుకూలంగా ఉంటూ భారత్ వ్యతిరేక నాయకుడిగా పేరు తెచ్చుకు న్నాడు. గతంలో మహింద రాజపక్స ఓటమి వెనుక భారత్ హస్తం ఉందని అంటారు. ఇప్పుడు గోటబయ కూడా చైనాకు అనుకూలంగా ఉండవచ్చు. అయితే కొన్నేండ్లుగా భారత్‌తో సామరస్య సంబంధాలు నెలకొల్పుకోవాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంత చైనా వైపు మొగ్గుచూ పినా రెండుదేశాల మధ్య సమతుల్యత కనబరుచడానికి ప్రయత్నించవచ్చు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ పేరుతో ఇతర దేశాల్లో పెద్దఎత్తున మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపడుతున్నది. కఠినమైన షరతులతో చైనా ప్రాజెక్టులు చేపట్టడం వల్ల ఆయా దేశాలు అప్పుల పాలవుతున్నాయి. గత కొన్ని ఏండ్లలో శ్రీలంక 8 వందల కోట్ల డాలర్ల మేర చైనా ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. ఇంత పెద్దఎత్తున అప్పులు చేయడం పట్ల అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమైంది. శ్రీలంక చైనా అప్పు లు తీర్చలేక 2017లో ప్రభుత్వరంగంలోని హంబంతోట రేవును చైనాకు అప్పగించింది. 1.2 బిలియన్ డాలర్ల అప్పునకు బదులుగా 99 ఏండ్ల లీజు పేరుతో ఈ రేవును చైనా హస్తగతం చేసుకున్నది. కొలంబో సిటీ ప్రాజెక్టు పేర మరో భారీ ప్రాజెక్టు చైనా రుణంతో సాగుతున్నది. శ్రీలంక రేవుల్లో చైనా యుద్ధనావలు తిరుగుతున్నాయి.

## అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గాజువాక: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకుపోతున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. జీవీయంసీ 63వ వార్డు కైలాస్ నగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగిరెడ్డి పాల్గొని శంకుస్థాపన చేసారు. ఈ సంధర్బంగా నాగిరెడ్డి మాట్లాడుతూ సుమారు 4లక్షల 90వేల ప్రభుత్వ నిధులతో ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, నాణ్యతలో రాజీ పడకుండా త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ. 10కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రధాన గెడ్డలను ఆధునీకీకరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోన్-5జెడ్సీ శ్రీదర్, ఇ.ఇ.వేణుగోపాలరావు వైకాపా నాయకులు కైలాస్‌నగర్ గౌరవ అధ్యక్షులు భాస్యం త్రినాధ్, అధ్యక్షులు వేణుగోపాల్, కర్రి సత్యన్నారాయణరెడ్డి, కర్రి జగన్‌మోహన్, ఆలి, రాజానరామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు విశేషస్పందన



గాజువాక: ఐద్వా, ప్రజారోగ్య వేదిక ఆద్వర్యంలో చినగంట్యాడ డాక్టర్ రమేష్ ఆసుపత్రి వద్ద మంగళవారం మహిళలకోసం ఉచితంగా నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు విశేషస్పందన వచ్చింది. పరిసర ప్రాంతంలోని సుమారు 281మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేసారు. ఈ సంధర్భంగా మమాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ సుభద్ర మాట్లాడుతూ కేన్సర్ మొదటి దశలోనే తెలుసుకొని, కేన్సర్ బారిన పడకుండా ఉండడానికి అవగాహన కల్పించడానికి ఈ స్క్రీనింగ్ టెస్టులు అన్ని ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గోశాల అసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ షర్మిలకుమారి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టు చేయించుకోవటం వలన అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. డాక్టర్‌రమేశ్‌కుమార్ మాట్లాడుతూ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టు చేయించుకుని మొదటి దశలోనే కేన్సర్‌ను అరికట్టడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గిరిష్, మహాత్మాగాంధీ ఆసుపత్రి కో-అర్డినేటర్ సంతోష్, ఐద్వా సుమిత్ర, సంతోషం నాగమణి, మంగసుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం




సింథియా/ములగాడ: పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకుంటే అనారోగ్యం దరిచేరదని, అందుకు ప్రతీ ఒక్కరూ శుభ్రత పాటించాలని వైకాపా జిల్లానాయకులు పొట్టిమూర్తి, పూడిమల్లేశ్వరరావులు తెలిపారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సంధర్బంగా అయిదు వార్డుల హెచ్‌ఆర్పీల ఆధ్వర్యంలో జీవీయంసీ 47వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసుకోవాలని, అలాగే దోమలు చేరుకుండా తగుజాగ్రత్తలను తీసుకోవాలని, డేంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఓ మహాదేవి, హెచ్‌ఆర్పీలు సుజాత, హేమలత, సాయి, రామలక్ష్మి, ఆర్పీలు రాజేశ్వరి, కే.వి.మాస్టర్, గాలిసన్యాసిరావు, పెద్దిరాజు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరనారీ ఝూన్సీ లక్ష్మీబాయ్ 191వ జయంతి వేడుకలు



గాజువాక: నియోజకవర్గ జనసేన వీరమహిళల ఆధ్వర్యంలో జనసేనపార్టీ కార్యాలయంలో వీరనారీ ఝూన్సీ లక్ష్మీబాయ్ 191వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరనారీ ఝూన్సీ లక్ష్మీబాయ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్బంగా వీర మహిళలు మాట్లాడుతూ వీర మహిళ ఝూన్సీ లక్ష్మీబాయ్ స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని, ఆమె దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు రెయ్యిరత్నం, కరణం కళావతి, లంక లత, లక్ష్మీ, జ్యోత్న్న, కోన విజయ, జనసేననాయకులు గడసాల అప్పారావు, జాగారపు శ్రీను, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ వాలంటీర్ వద్ద ప్రజల డేటా ఉండాలి

గొలుగొండ: గ్రామాల్లో ఉన్న ప్రతీ కుటుంబాల తాలుక వివరాలు వాలంటీర్ల వద్ద ఉండాలని, దీని కోసం ఎంపిక చేసిన కుటుంబాల వద్ద ప్రతీ వివరాలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి గోపికుమార్ అన్నారు.

మంగళవారం నవశకం కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లకు ఎంపిక చేసిన 50 కుటుంబాల్లో రోజు ఐదు కుటుంబాల వివరాలు వెంటనే సచివాలయం సిబ్బందికి తెలియజేయాలన్నారు. దీని వలన పది రోజుల్లో ప్రతీ వాలంటర్ పూర్తి స్థాయిలో వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వతంత్ర్యత మహిళా సాధికారతకు తొలిమెట్టు



సింథియా/ములగాడ: ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించినప్పుడే మహిళా సాధికారత సాధ్యపడుతుందని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా స్పష్టంచేసారు. మల్కాపురం ప్రకాష్‌నగర్ లోని శాఖాగ్రంథాయలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని, భారతరత్న, ఉక్కుమహిళ శ్రీమతి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్య, చైతన్యం, ప్రజాజీవితం మహిళలకు ఎంతో అవసరమని అన్నారు. శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినాన్ని గ్రంథాలయంలో మహిళాదినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. మహిళలంతా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొవాలని ఉక్కుమహిళగా ప్రతీ ఒక్క మహిళ ఎదగాలని అన్నారు. అనంతరం సిస్టర్ గెసిల్లాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్.భాగ్యలక్ష్మి, సత్యానందరావు, జి.కె.విశ్వనాధరాజు, వై.అనసూయాదేవి, అజయ్‌కుమార్, స్థానిక యువకులు జాతీయ సేవా పథక కార్యకర్తలు, కళాశాల విధ్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.
ఫోటో:నెం:06ఏ: మాట్లాడుతున్న దృష్యం.

## ఘనంగా ఇందిరాగాంధీ 102వ జయంతి వేడుకలు



సింథియా/ములగాడ: భారత రత్న, ఉక్కుమహిళ, మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు దాకారపు నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం జీవీయంసీ 47వ వార్డు ప్రధాన రహదారి వద్దనున్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా గుల్లలపాలెం ఆసుపత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుల్లలపాలెం ప్రభుత్వ వైద్యులు సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను ప్రజలు మర్చిపోలేరని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఆమె అడుగుజాడలలో నడవాలని సూచించారు. అనంతరం సీనియర్ నాయకులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియాదాస్, కోటేశ్వరరావు, రజియాబేగం, సుశీల, వరలక్ష్మి, వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## మరుగుదొడ్లు వినియోగించాలి




గొలుగొండ: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం గొలుగొండ మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఎపిఎం గోవిందరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్ల అవశ్యకత తెలుసు కోవాలన్నారు. బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల గ్రామాలు అపరిశుభ్రంగా తయారవుతాయన్నారు. కావున అందరూ మరుగుదొడ్ల వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంల సమాఖ్య అధ్యక్షులు, సిసిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవ దేవుడు.. శ్రీ వేంకటేశుడు

## సంకీర్తన



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూతకాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం కలియుగ టళికుంతమని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడై%న శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి ఆనంద నిలయమనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

**స్థలపురాణం**

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహా ద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసో త్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణ వనం అధిపతులు ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయనగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహ రాయలు, శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలరాయలు, అచ్యుత రాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంక ర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి /బీబీనాంచారి/ అలివేలుమంగ అమ్మవారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశ గంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం.. వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాశస్త్య మున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహ నాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కు బడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి కల్యాణకట్ట వద్దనే తలనీలాలు సమర్పించాలి

**శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శన వేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈ-దర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది.

ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

డాక్యుమెంట్స్ పోయినవి
తెడ్లాపు వెంకటరాం
S/o తెడ్లాపు రాములు (లేటు) అను నా యొక్క కొమ్మాది, మధురవాడ, విశాఖపట్నంలో గల పద్మజ నిర్మాణ్ అపార్ట్‌మెంట్‌లో గల ఫ్లాట్ నెం. 313 యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్ నెం. 4518/2012 టౌన్ కొత్త రోడ్డు నుండి కోటవీధికి వెళ్ళే మార్గంలో 1-11-2019 నాడు పోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.
93463 00983

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
M.O.P.336/2010

Between :
D. Appala Raju (The petitioner being minor, Rep. by his maternal aunty i.e., P. Sridevi natural guardian) ...Petitioner
And
P. Kanaka Durga Raju & others ...Respondents

NOTICE

To,
Respondent No.3 :
Sri. Rajeti Demudu, S/o.Babji, Hindu, aged 27 years, R/at. D.No. 1/16, S.C.Colony, Vepagunta, Visakhapatnam.

The notice that the above M.O.P filed by the petitioner for claiming compensation. The same stood posted to on **25-11-2019** for your appearance on that day you should attend the court in person or through Advocate at **10:30 A.M** failing which the matter will be decided in your absence.

S.N.K. MAHANTHI,
O.VARALAKSHMI,
Advocates
Visakhapatnam-2, Ph: 0891- 2525100

## మందులు సక్రమంగా వాడితే కుష్టి వ్యాధి దూరం

కోటవురట్ల: మందులు సక్రమంగా వాడితే కుష్టి వ్యాధిని దూరం చేసుకోవచ్చునని కోటవురట్ల పిహెచ్‌సి వైద్యాధికారి ఉమాదేవి అన్నారు.

# ఉత్సాహంగా యువజనోత్సవాలు

కాకినాడ : జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్రాజ్ ) ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. కాకినాడ అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఈ ఉత్సవాలులో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంక్షేమశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం యువతకు పలు క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని వాటిని అందిపుచ్చుకుని యువత తమ ప్రతిభను చాటాలని సూచించారు.సెట్రాజ్ సీఈవో బి.విజయభాస్కర్ మాట్లాడుతూ గత ఆగస్టు నెల 28 నుండి జిల్లాలోని అన్ని రెవిన్యూ డివిజన్‌లలో యువజనోత్సవాలు నిర్వహించడం జరుగుతోందని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర,జాతీయ స్థాయిలలో నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. శాస్త్రీయ సంగీతం, నృత్యం,వాయిద్య పరికరాలు, వక్తృత్వము, చిత్రలేఖనం, తదితర అంశాలపై పోటీలు జరుగుతున్నాయన్నారు.త్వరలో జిల్లా స్థాయి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పలుపోటీలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో సెట్రాజ్ ఏవో సివి.సూర్యనారాయణ,మేనేజర్ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంభేరుపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్ధులకు టై, బెల్టులు వితరణ

చోడవరం-మండలంలోని అంభేరుపురం గ్రామం ఎస్.సి, కోలనీలోని మండల పరిషత్తు ప్రాధమిక పాఠశాల విద్యార్ధినీ, విద్యార్ధులకు మంగళవారం స్థానిక వై.సి.పి నాయకులు టై, బెల్టులను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డు అధ్యాపకులు నడుపూరి దేముడు, వై.సి.పి, నాయకులు శరగడం రామకృష్ణ, దాడి వెంకట అప్పారావు,మాజీ వార్డు మెంబరు నడుపూరి దేముడు, విద్యాకమిటీ ఛైర్మన్ కొల్లి రామకృష్ణ, వై.స్, ఛైర్మన్ ఆడారి పద్మ, నందికోళ్ల దేముడు, ముత్యాల రాజుబాబు, కమిటీ సభ్యులు, విద్యార్ధుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బిల్డ్ ఎపీ కోసం ఏయూ భూములను సేకరించదలిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదు

### సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

విశాఖపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం బిల్డ్ ఏపీ పేరుతో ప్రభుత్వ విద్యా సంస్థలు భూములను సేకరించదలిస్తే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొనక తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ హెచ్చరిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ భూములను సేకరించడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వ పథకాల అమలు కోసం ఏయూ భూములను విక్రయించాలని ప్రయత్నిస్తే రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో తీవ్రమైన ఇబ్బందులుకు గురికావల్సి వస్తుందని సిపిఎం తెలియజేస్తోంది.

విద్యా వ్యాప్తి జరగాలన్న గొప్ప లక్ష్యంతో దాతలు 500 ఎకరాలు భూములు ఇచ్చారు. ఈ భూములను విక్రయించే హక్కు ఎవరికీ లేదు. ఇప్పుడున్న భూములను విక్రయిస్తే భవిష్యత్‌లో యూనివర్సిటీ విస్తరణకు తీవ్ర అడ్డంకిగా మారుతోంది. 1926లో ఏర్పాటైన విశ్వవిద్యాలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ దేశంలోనే చముచితమైన స్థానాన్ని ఏయూ పొందింది. దేశం నలుమూల నుండి అనేక రాష్ట్రాలకు చెందిన విద్యార్ధులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే పెట్రోలియం, ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ క్లాసులు కూడా ఏయూలో జరుగుతున్నాయి. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి భూములు తప్పనిసరిగా ఉండాలి. నగరం నడిబొడ్డున ఉన్న స్థలాలు కాపాడాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించడం సరైనదికాదు. విద్యా వ్యాప్తికి అనేక పరిశోదన కేంద్రాలు భవిష్యత్‌లో ఏర్పాటు చేయాల్సి వుంది. గత ప్రభుత్వం కూడా ఈ భూములపై కన్నేసినా తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. ఇప్పుడు మరలా రాష్ట్ర ప్రభుత్వం ఏయూ భూములను సేకరించాలనే నిర్ణయాన్ని వెంటనే మానుకోవాలి. లేకపోతే ఉత్తరాంధ్రవాసుల ఆగ్రహానికి గురికాక తప్పదు. మేధావులు, ప్రజాతంత్రవాదులు, ప్రజా సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని సిపిఎం కోరుతోంది.

## సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి పుండాలి

### జిల్లా కలెక్టర్ జె.నివాస్



శ్రీకాకుళం: సంక్షేమ పథకాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వై.ఎస్.ఆర్. నవశకం కార్యక్రమంపై నోడల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దారులు, మండల అభివృద్ధి అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది.

రైస్ కార్డులు, వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ కార్డులు, వై.ఎస్.ఆర్. పెన్షన్ కార్డులు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వాసంతి దీవెన, వై.ఎస్.ఆర్.సున్నా వడ్డీ, వై.ఎస్.ఆర్.అమ్మ ఒడి, కాపు నేస్తం, రజక, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థిక సాయం, అర్చకులకు జీతాల పెంపుదల, ఇమామ్ లు, మౌజామ్స్, పాస్టర్లకు గౌరవ వేతనం తదితర సంక్షేమ పథకాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ పథకాలను నిజమైన లబ్దిదారులు అందచేయాలన్నారు.

ఇందులో వాలంటీర్ల పాత్ర అత్యంత ప్రముఖమైనదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్ల నియామకం ప్రక్రియ బుధవారం లోగా పూర్తి చేయాలన్నారు. గురువారం నాటికి వారందరూ తమతమ విధులలో చేరాల్సి వుంటుందన్నారు.

## వైభవంగా కార్తీక దీపోత్సవం

చోడవరం కార్తీక మాసోత్సవాలలో భాగంగా మండలంలోని గజపతినగరం గ్రామంలోని ముత్యమాంబ అమ్మవారి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. స్థానిక మహిళలు , పెద్దలు పిల్లలు కుటుంబ సమేతంగా పాల్గొని శివనామ స్మరణ చేస్తూ కార్తీక జ్యోతులను వెలిగించారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం ఆవరణలోను దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గోవాడలో ప్రారంభమైన సత్యసాయి వేడుకలు

చోడవరం-మండలంలోని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలోని సత్యసాయి ఆలయంలో సత్యసాయి వార్షికోత్సవ వేడుకలు భక్తి,శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా తెల్లవారు జామున గోవాడ, అంభేరుపురం గ్రామాలలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం సత్యసాయి బాబాకు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారుల ఔదార్యం

- ప్రధాన రహదారి పొర్లు కట్టు వద్ద భారీ గుంతలతో తరచూ ప్రమాదాలు
- అధికారులు పట్టించుకోకపోవడంతో
- స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి సిమెంట్‌తో పూడ్చివేత
- స్థానికులు హర్షం



చోడవరం: మండలంలోని వెంకన్నపాలెం- సబ్బవరం ప్రధాన రహదారి అడ్డూరు సమీపంలో పొర్లుకట్టు వద్ద భారీగా గుంతలు ఏర్పడి ఆరు నెలలకుపైగా అవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో ద్విచక్రవాహనదారులు గుంతలలో పడి తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. ప్రమాదాలను స్వయంగా చూసిన స్థానిక అయ్యప్ప స్వామి భక్తులు మంగళవారం స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి సిమెంట్‌తో భారీ గుంతలను శాశ్వతంగా పూడ్చి ఔదార్యం చాటుకున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోయినా స్వచ్ఛంధంగా వచ్చిన అయ్యప్ప మాలధారులను స్థానికులతో పాటు, పలువురు వాహనదారులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వై.లోవ కుమార్, కె.కృష్ణ, కె.నరేష్, పి.దేముడు నాయుడు, ఎ.దేముడుబాబు, జి.నాయుడు, బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# 21న జగన్ సభకు తరలివెళదాం

### ఏఐటియూసీ పిలుపు

కాకినాడః ఈ నెల 21వ తారీకు నాడు మత్యకార దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటిస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఆయన వద్దకు జిల్లాలో ఉన్న ఆర్పీలు,యానిమేటలు,కాంట్రాక్టు ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ కూడా తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్పీ ,యానిమేటర్ల సంఘం గౌరవ అధ్యక్షులుతాటిపాక మధు పిలుపునిచ్చారు .ఈరోజు స్థానిక రామారావు పేట ఏఐటీయూసీ కార్యాలయంలో యానిమేటర్లు,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకలప్రసాద్ అధ్యక్షత వహించారు.ముందుగా జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మంది యానిమేటర్లను 64 జీవో చట్టాలతో తొలగించడం అనేది చాలా అన్యాయమని ఆయన అన్నారు.అదేవిధంగా గత ఎనిమిది నెలలుగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు.అంతే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులు,ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉద్యోగులు ఉంటాయో తెలియని భయాందోళనలో కార్మికులు ఉన్నారని ఇటువంటి తరుణంలో ఈ జిల్లాకు వస్తున్న జగన్ వద్దే మా పంచాయతీ తేల్చుకుంటామని మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మధు తెలియజేశారు. గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు అన్ని వర్గాలకు హామీలు ఇచ్చారని అలాగే ఇచ్చిన హామీలు కూడా అమలు చేస్తూనే మరో పక్క కాంట్రాక్ట్ కార్మికులు యానిమేటర్లను రోడ్డున పడుతున్నారని కార్మికులు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేయాలంటే అన్ని వర్గాలకు మేలు చేయాలని లేనిపక్షంలో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల నేపథ్యంలో తగిన గుణపాఠం దానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలియజేశారు. యానిమేటర్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ దేవి ,గంగాభవాని ఇరువురు మాట్లాడుతూ గత మూడు నెలలుగా యానిమేటర్లు మానసిక ఆవేదన ఆందోళనలో ఉన్నారని వారు అన్నారు .ఉద్యోగం ఉందో లేదో తెలియని భయం ఆందోళనలో ఉన్నారన్నారు.ఒకపక్క ఉద్యోగం తొలగించడం లేదని చెబుతూనే మరోపక్క ఉన్న ఉద్యోగాలు తొలగిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయకుండా రాష్ట్ర ఉద్యమానికి సిద్ధంగా ఉంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లోవరత్నం యూనియన్ ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి,ఉపాధ్యక్షురాలు కేకేఆర్.కుమారి,దుర్గ భవాని వెంకటలక్ష్మి ,ఎఐఎస్ఎఫ్ జాన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ, మండల స్థాయి కమిటీలతో పార్టీ బలోపేతం చేయండి

**చోడవరంలో టీడీపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు -పాపర్ల ప్రసాద్**

చోడవరంః రాబోయే స్థానిక ఎన్నికలలోగా గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపి చోడవరం నియోజకవర్గ పరిశిలకులు పాపర్ల ప్రసాద్ అన్నారు. చోడవరం పట్టణంలోని టీడీపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ సభ్యుత్వం కలిగిన వారిని, పార్టీ బలోపేతంగా చేసిన వారిని గ్రామ మండల కమిటీలలో స్థానం కలిగించడం జరుగుతుం దన్నారు. టీడీపీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఓటుగా మలిచేలా ప్రతి ఒక్కరు సమాయత్తం చేయాలన్నారు. వచ్చే పంచాయతీ, మండల పరిషత్తు ఎన్నికలలో పట్టుసాధించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ గత టీడీపి హయాంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులకు వై.సిపి నాయకులు మోకాలడ్డుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపిమండల పార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్, షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ గూనూరు మళ్ల నాయుడు, మాజీ ఎం.పిపీ, గూనూరు పెదబాబు, మాజీ జెడ్.పి.టీ.సీ.సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు,మాజీ వై.స్.ఎం.పీపీ. భూతనాధు నానికుమార్, బత్తుల తాతయ్యబాబు, దొడ్డి కిశోర్, వేగి శ్రీనివాసరావు, కేదారిశెట్టి గుప్తా, జెట్టి మాణిక్యం, పాతాళం శ్రీను, నాగులాపల్లి శ్రీనివాసరావు, గవరవరం నాయకులు చప్పగడ్డ వెంకటస్వామినాయుడు, మూర్తి, నాగులాపల్లి సూర్యనారాయణ,దాసరి అప్పారావు చోడవరం టౌన్ నాయకులు ముడుసు గోవింద, మాదిరెడ్డి జోగినాయుడు చోడవరం, రావికమతం, బుచ్చియ్యపేట, రోలుగుంట నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బలిపీఠం పై బాలల భవిష్యత్తు

### 20న బాలల హక్కుల దినం

హాయి కలిగితే ఆనందంగా నవ్వడం... బాధ కలిగితే ఏడవడం, లోకం పోకడ తెలియని చిన్నారుల మనస్తత్వం. కొడితే ఏడుస్తారే తప్పితే తమ హక్కుల గురించి అడగరు. అయితే బాలల హక్కులను సంరక్షించవలసిన భాధ్యత సమాజం పై ఉంది, ప్రభుత్వాలపై ఉంటుంది. బాల్యంలో తప్పనిసరిగా అవసరమయ్యే విద్యా, వైద్యం, పౌష్టికాహారం, ఆరోగ్యంలాంటివి ఎప్పటికప్పుడు తీర్చాలి. అప్పుడే మనం వారి మానసిక వికాసం, పెరుగుదల పట్ల శ్రద్ధ చూపిన వాళ్ళమవుతాం. ఈ అవసరాలను గమనించి 1990 సెప్టెంబర్ లో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ప్రపంచ సదస్సులో బాలల యోగక్షేమాల గూర్చి చర్చించారు. ఈ సదస్సులో చైల్డ్ రైట్స్ కన్వెన్షన్( సి.ఆర్.సి ) రూపొందించారు. 1992 డిసెంబర్ 2 న మనదేశం సి ఆర్ సి పై సంతకం చేసింది. ఇందులో పేర్కొన్న బాలల హక్కుల గురించి ప్రచారం చేయడానికి నవంబర్ 20వ తేదీని సి ఆర్ సి డే గా జరుపుతున్నారు. దాదాపు ప్రపంచ దేశాలన్నీ ఈ చారిత్రాత్మక ఒప్పందం నిర్దేశించిన నియమాలను ప్రమాణాలను పాటిస్తామని అంగీకరించాయి. దీని ప్రకారం 18 ఏళ్ళు లోపు బాల బాలికల సంరక్షణ, పోషణ ప్రతి ఒక్కరి భాద్యత. ముఖ్యంగా ప్రభుత్వాల ప్రాధాన్యతా అంశం. బాలల శ్రమను దోచుకోవడం, బాల్యాన్ని నిలిపివేయడం ప్రపంచ మంతటా జరుగుతోంది. కాబట్టే బాలల హక్కుల పట్ల పెద్దలను చైతన్య పరచాల్సిన అవసరం ఉంది. మనదేశంలో పిల్లలు బాలకార్మికులుగా అక్కడక్కడ ఇప్పటికీ కనిపించడం విచారకరం. వీధి బాలలు చిత్తుకాగితాలు ఏరుకుంటూ, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, రైల్వే స్టేషన్ల వద్ద కనిపిస్తూ ఉంటారు. వీధి బాలలకు షెల్టర్స్ ఉన్నాయి, కానీ ప్రయోజనం అంతంత మాత్రమే. బలిపీఠం పై బాలల భవిష్యత్తును పణంగా పెట్టకుండా జాతీయ బాలల కమిషన్ ద్వారా వారి సంక్షేమాన్ని అక్షరాల అమలుచేసిన నాడే నేటి బాలలు రేపటి ఉత్తమ పౌరులు కావడానికి అవకాశం ఉంది. లేకపోతే దేశం నిర్వీర్యంగా మారుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు 250కి పైగా శాసనాలు చేశాయి. 1996లో సుప్రీం కోర్టు బాల కార్మిక వ్యవస్థను రద్దుచేసింది. ప్రపంచదేశాలన్ని విశ్వ బాలల దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి 1954 డిసెంబర్ 14 న సూచించింది.

1959లో బాలల హక్కుల ప్రకటనను, 1989లో బాలల హక్కుల కన్వెన్షన్ ను నవంబర్ 20 న చేసింది. అందువలన నవంబర్ 20 న విశ్వ బాలల దినోత్సవం యునిసెఫ్ నాయకత్వంలో జరుపుచున్నారు. దేశాల పిల్లల మధ్య సమన్వయం, అవగాహన పెరగాలని ఈ దినోత్సవ ఉద్దేశం. బాలల హక్కులను గుర్తించి వాటి అమలుకై మనమందరం పాటుపడదాం...!!

# మౌలిక వసతులు కల్పించాలి

అనంతగిరి, అరకు లోయ నియోజకవర్గం, హుకుంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ స్కూల్ ను వెంటనే (1) భవన సదుపాయం కల్పించాలని (.2)మరుగుదొడ్లు సదుపాయం, (3)మంచినీరు బోర్ సదుపాయం. (4)ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యుడు కీల్లోసురేంద్ర డిమాండ్ చెయ్యడమైనది. ఈరోజు సిపిఎం హుకుంపేట కమిటీ ఆధ్వర్యంలో హుకుంపేట బాలుర ఇంగ్లీష్ మీడియం పాఠశాలను పరిశీలించడమైనది.2016 లో ఈ స్కూల్ ను ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేశారు ముడునుండి 8 వ తరగతి వరకు 324 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ళు గడిచినా శాశ్వతబవనాలు మంజూరు చెయ్యలేదని. భవనం లేక జూనియర్ కళాశాల భవనాన్ని తాత్కాలికంగా స్కూల్ నడుస్తుంది. కనీసం మరుగుదొడ్లు సదుపాయం కల్పించలేదు విద్యార్థినులు ఆరుబయట వెళ్ళేపరిస్తితి ఉంది.కనీసం త్రాగునీరు కూడా అందించలేని పరిస్థితి ఉంది.ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచిన విద్యార్థులకు కనీసం ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు అందించలేని పరిస్థితి ఉంది.ఏజెన్సీలో 2016 లో 12 ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఆయాస్కూల్స్ కు మాత్రం భవనాలు, ఇంగ్లీష్ మీడియం బోధించే టీచర్స్ ఏర్పాటు చెయ్యలేదని వాపోయారు

## వెంకన్నపాలెం శివారులో ఆటో బోల్తా

**ముగ్గురికి గాయాలు, ఎన్.టి.ఆర్.ఆసుపత్రికి తరలింపు**



చోడవరంః అనకాపల్లి ప్రధాన రహదారి వెంకన్నపాలెం శివారు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. చోడవరం నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ఆటోకు అకస్మాత్తుగా కుక్కల గుంపు ఎదురుగా రావడంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టు రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో చోడవరం శివాలయం వీధికి చెందిన, వెంకన్నపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు జి.వి. శారద చేతి మణికట్టు వద్ద విరగగా, అంభేరుపురం గ్రామానికి చెందిన యువతి డి.అశ్వని, ఎ.సంతోషినికి నడుము ముఖం భాగాంలో గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్సు సిబ్బంది చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి అనకాపల్లి ఎన్.టి.ఆర్.ఆసుపత్రికి తరలించారు.

## స్వర్ణ శోభితంగా... వరి పంటలు



దేవరాపల్లి : పొలాల్లోని వరి పంట స్వర్ణ శోభితంగా కనిపిస్తూ ప్రకృతిని పులకరింప చేస్తుంది. పంటదశకు చేరుకున్న వరిచేలు బంగారు రంగులో మారి రైతుల కళ్ళల్లో ఆనందం నింపుతుంది. దశాబ్దకాలంగా వరుణుడు కరుణించక పంటలు సరిగా పండక రైతన్న అన్నివిధాలా నష్టాల పాలై బక్కచిక్కిన సంగతి అందరికీ తెలిసిందే అందుకు భిన్నంగా ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడి ఏరువాకకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని వరిపొలాలు పంట దశకు చేరుకోవడంతో అంచెలంచెలుగా వరికోతలు జరుగుతున్నాయి.

## వై.యస్.ఆర్ కంటి వెలుగు



భీమునిపట్నం: స్థానిక పొట్టి శ్రీరాములు హై స్కూల్ లో మంగళవారం వై యస్ ఆర్ కంటి వెలుగు రెండవ విడతలో బాగంగా డాక్టర్ సి హెచ్ ప్రసాద్ రాజ్ ఆద్వర్యంలో విద్యార్ధులకు కంటి పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమం లో స్కూల్ హెచ్.ఎం.సి.హెచ్. సింహాచలం, ఇతర ఉపాధ్యాయులు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

## పుట్ పాత్ మీద ఉన్న అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ



భీమునిపట్నం: భీమిలి వాస్తవ్యులు పి.వి.రమణయ్య ( హెచ్ పి గ్యాసే ) డీలర్ కుమారుడు శ్రీనివాస్ చలికాలం సందర్భంగా పుట్ పాత్ మీద రాత్రి వేళల్లో అభాగ్యుల కు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో వుయ్ కేర్ యు ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, దిలీప్ ,దినేష్ లు డి .సి.ఆర్.సేవారథం లో తగరపువలస నుండి విశాఖపట్నం వరకు అర్ధరాత్రి వరకు పుట్ పాత్ మీద అభాగ్యులకు అందజేసారు.

### వృద్ధులు,వితంతువులు, అంగవైకల్యం వారికి ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ

భీమునిపట్నం: స్థానిక నాయకులు ఆలివర్ రాయి ఆధ్వర్యంలో తమ తల్లి ఆచార్య సత్యబాల జ్ఞాపకార్థం వితంతువులకు, వృద్ధులకు, అంగవైకల్యం గలవారికి ప్రతీ నెల ఉచిత నిత్యావసర సరుకులు ఇవ్వబడునని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన లబ్దిదారులను ముందుగా గుర్తించి వారికి టోకెన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తదుపరి నిర్ణిత రోజున వారికి అందించబడునని చెప్పారు. వితంతువులు,వృద్ధులు, వికలాంగులు ప్రాధాన్యత ఇవ్వబడునని చెప్పారు. ఇటువంటి సహాయం కావాల్సినవారు ఉన్నచో వారి వివరాలను తెలియజేయగలరని అన్నారు. దీనిలో ఏ రీతిలో నైన పాల్గొన్నదల్చిన వారు కూడా సంప్రదించగలరని ఆయన కోరారు.



**మహిళా దినోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల పిల్లలకు రంగవల్లుల పోటీలు హై స్కూల్ పిల్లలకు ప్లీజ్ కాంపిటేషన్ నిర్వహించి గ్రంథాలయంలోనూ గ్రంథాలయ ప్రముఖులకు నివాళు లర్పించిన గ్రంథాలయ అధికారి రాజబాబు తెలిపారు**

## ఘనంగా శ్రీ నాగూరమ్మ అమ్మవారు పండుగ



అచ్యుతాపురం :మత్స్యకార గ్రామమైన పూడిమడకలో శ్రీ నాగూరమ్మ అమ్మవారు పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు .తెల్లవారుజాము నుంచే భక్తులు గుడి దగ్గరికి చేరుకుని అమ్మవారిని దర్శించికుని మొక్కులు తీర్చుకున్నారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం



నాతవరం: నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ జన్మది నంను పురస్కరిం చుకొని నాతవరం మండలం సరుగుడు గ్రామంలో మంగళవారం ఉమాశంకర్గణేష్ యువజన గిరిజన సేవ సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి జమీలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పోటీలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఈ పోటీలకు సరుగుడు పంచాయతీలోని 12 గ్రామాల నుండి టీము సభ్యులు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శెట్టి నూకరాజు, పైల పోతురాజు, మాజీ సర్పంచ్ సాగిన లక్ష్మణమూర్తి పాల్గొన్నారు

## వేములపూడిలో గుర్రం పందెం పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



నర్సీపట్నం: మండలంలోని లోని మేృలపూడి లో జరుగుతున్న గుర్రపు పందేలు పోటీలును నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు .మంగళవారం గ్రామంలో పండగ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మొదటగా బోళెం నరసింహమూర్తి కుమారుడు దీవెన గుర్రాన్ని స్వారీ చేసి గ్రామ ప్రజలను చుట్టుప్రక్కల వారిని ఆనందింప చేశారు. అనంతరం గ్రామంలోని ఎమ్మెల్యే బంధువులు రమణ ఇంటికి సతీ సమేతంగా వెళ్లారు. అక్కడికి వచ్చిన ఎండపల్లి మాజీ మునసబు మనుమడి కుటుంబాన్ని పలకరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ లోవరాజు స్థానికంగా ఉన్న టెంపుల్ వద్ద సమస్యను ఎమ్మెల్యే కు వివరించారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట భారీగా నర్సీపట్నం నుండి కాన్వాయి బయలుదేరింది. నాలుగు మండలాల నుంచి ముఖ్య నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఆయనతోపాటు వెళ్లారు.

# ఘనంగా అంబళం పూజా




భీమునిపట్నం: భీమిలి మండలం,లక్మిపురం గ్రామం లో శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామిసేవాపీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి వారి అంబళం పూజామహోత్సవం ఘనంగా జరిగినది. కరుభుక్త. అప్పలనారాయణ స్వామి 22వ పడి సంధర్భ ముగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంకు గురుస్వామి ఆకెళ్ల.నరసింహ మూర్తి స్వామి వారికి పంచామృతాభిషేఖములు, అష్టోత్తర సతనామావలి, విశేషమైన పూజాద్రవ్యము లుతో అభిషేకములు జరిగినవి. భీమునిపట్నం వాస్తవ్యులు అడిదం,సన్యాసిరాజు గురుస్వామి చే అయ్యప్ప భక్త రంజని కార్యక్రమం మరియు అరసవల్లి వాస్తవ్యలుచే సన్నాయి మేళతాళాలు, వాయిద్యాలుతో పూజాకార్యక్రమము కడురమ్య ముగా జరిగింధి. భీమునిపట్నం గురుస్వామి కుటుంబరావు ఆధ్వర్యంలో మెట్ల పూజ కార్యక్రమం. అలాగే పీఠం గురుస్వామి గాడు.శ్రీను పర్యవేక్షణలో అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు.తాతినాయుడు మరియు వివిధ ప్రాంతాలు నుండి వచ్చిన గురుస్వాములు,భవాణీలు సుమారు మూడువేల మంది పాల్గొన్నారు. పూజాకార్యక్రమము అనంతరము ప్రసాధవితరణ కార్యక్రమము మరియు హరిహరశనం కార్యక్రమంతో పాటు,స్వామివారి పవళింపు కార్యక్రమంతో పూజాకార్యక్రమము ముగిసినది.ఈ కార్యక్రమం లో భీమిలి ఇన్ చార్జ్ ఎం.మహేష్,పెదబాబు, మాజీ ఎం.పి.పి. గాడు.వెంకటప్పడు, మణిశంకర్ నాయుడు, గుడ్డాల.ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, ఆనందం పంచుకునేందుకే వన మహోత్సవం



రావులపాలెం: ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆనందం, ఆరోగ్యం పెంపొందించుకోడానికి కార్తీక వనమహోత్సవాలు దోహదపడతాయని అక్షరదీపిక స్వచ్చంద సేవా సంస్థ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోతంశెట్టి కనికిరెడ్డి టింబర్ డిపో ఆవరణలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అక్షర దీపిక స్వచ్చంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పోతంశెట్టి కనికిరెడ్డి, పడాల రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. ముందుగా భాస్కర హోటల్ సత్యనారాయణరెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పడాల పాపిరెడ్డి దంపతులతో లక్ష్మినారాయణ స్వామికి, కార్తీక దామోదరునికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా పోతంశెట్టి కనికిరెడ్డి మాట్లాడుతూ స్నేహభావానికి ప్రతీకగా కుల మతాలకు అతీతంగా కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం గత 33 సంవత్సరములుగా ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ వన సమారాధన వల్ల ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని, కుటుంబ సమేతంగా ఈ భోజనం సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా వన మహోత్సవం నిర్వహిస్తున్నామని, కుల మత వర్గ తారతమ్యాలు లేకుండా పరిసర ప్రాంతాలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలనుండి భక్తులు అశేష సంఖ్యలో వచ్చి వన మహోత్సవంలో పాల్గొని భోజనం స్వీకరిస్తున్నారని ఇదే మా ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పెల భజన మండలి ఆలపించిన భక్తిగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం భజన మండలి నిర్వాహకులు ఆకుల వీర్రాజు, శ్రీకాకుళంకు చెందిన మెహర్ చైతన్య ఉచిత సంగీత శక్షణ నిర్వాహకులు జి.ఎస్. ప్రకాశరావులను దుశ్శాలువాతో, పూతదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారుతి సత్తి రామకృష్ణారెడ్డి, మిల్లు రామయ్య, కుడిపూడి నాగ భూషణం విశ్రాంత మాస్టారు, నందం వీర వెంకట సత్యనారాయణ, దుళ్ళ వెంకటేశ్వర్లు, కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



**నాయుడు తోటలో నర్సింగమ్మబిల్లి అమ్మవారిని దర్శించుకున్న ఏం ఎల్ ఏ గణబాబు గారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు రాపర్తి కన్నా, రామరాజు,. రఘు తదితరులు హాజరయ్యారు.**

## సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసిన వినుకొండ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: వినుకొండ నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలపై సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే... వినుకొండ పట్నంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల పడకల వంద పడకల పడకల వైద్యశాల గా మార్చేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. వినుకొండ, నూజెండ్ల మండల రైతులకు జీవన్ ఆధారమైన తంగిరాల ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతించాలని కోరారు .ఈ ప్రాజెక్టు వలన 50 వేల ఎకరాలు సాగులోకి రావడమే కాక వినుకొండ పట్టణానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం జరుగుతుందని సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే వివరించారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం 1200 కోట్లు నిధులు కేటాయించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి గారికి ఎమ్మెల్యే బొల్లా కృతజ్ఞతలు తెలిపారు . బొల్లాపల్లి మండల ప్రజలకు ఆధారితమైన వరికపూడిశెల ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినుకొండ



నియోజకవర్గం లోని లోని ప్రధాన సమస్యలపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# అందరూ పరిశుభ్రత పాటించాలి



నర్సీపట్నం: అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని నర్సీపట్నంలో ని గ్రూపు సభ్యులందరికీ మెప్మా పిడి విజయలక్ష్మి సూచించారు వరల్డ్ టాయిలెట్ డే ఈ సందర్భంగా ఆమె నర్సీపట్నంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా అవగాహన కలిగి ఉండాలన్నారు కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ రవి డిపిఓ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన విద్యార్థులందరికీ అమ్మవడి

## యం ఈఓ దేవరాయల్

అచ్యుతాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయుచున్న జగనన్న అమ్మవడి పథకం అర్హులైన విద్యార్థులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని యం ఈ ఓ దేవరాయల్ అన్నారు .మంగళవారం ఆయన విజయభాను విలేఖరితో మాట్లాడుతూ అమ్మవడి పథకం 1 వ తరగతి నుండి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని ,ఆ విద్యార్థి కుటుంబం బిపిఎల్ కు చెందినవారై తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు . విద్యార్థి,తల్లి ఆధార్ పొంది ఉండాలని, విద్యార్థి తల్లి లేదా సంరక్షుకుడు ఆధార్ , బ్యాంక్ ఖాతా ,రేషన్ కార్డు ,75 % విద్యార్థి హాజరు నమోదు ఉండాలన్నారు . పాఠశాలలకు వెళ్ళని , మద్యలో బడి మాని వేసిన విద్యార్థులకు అమ్మవడి వర్తించదన్నారు .అలాగే పెన్షన్ తీసుకుంటాన్నావారికి వర్తించదన్నారు.



# వైయస్ అర్ నవశకం శిక్షణాతరగతులు

**ముఖ్యఅతిథిగా నియోజకవర్గ స్పెషల్ అఫీషర్ హజరు**

పరవాడ:రాష్ట్రపభుత్వము ప్రవేశపెట్టిన వైయస్ అర్ నవశకం కార్యక్రమ పథకాలుపై సచివాలయం సిబ్బంది,వాలంటీర్లు పూర్తిస్దాయిలో అవగాహన కలిగిఉండాలనీ నియోజకవర్గ స్పెషల్ అఫీసర్ పి.శ్రీనువాస్ మూర్తితెలిపారు. మంగళ వారము పరవాడ మండలము గోర్లివానిపాలెం పరిధి జెఎన్ అర్ ఎమ్ కోలనీలోగల సామాజిక భవనంలో శిక్షణాతరగతులును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ స్పెషల్ అపీసర్ పి.శ్రీనువాస్ మూర్తిహజరై న్నారు.అనంతరము అయన మాట్లడుతూ వైయస్ నవశకం కార్యక్రమం పథకాలుఅమలులో వాల ంటీర్లుదే కీలకపాత్రఅని పేర్కోన్నారు. గ్రామవాలె ంటర్లీ తమకుకేటాయించిన 50ఇళ్ళు యొక్కపూర్తి సమాచారాన్ని సేకరించాలనీ అన్నారు. ఈయొక్క సమాచారాన్ని బట్టి వైయస్ అర్ నవశకంపదకము ద్వారా బియ్యంకార్డు, పీజురియంబర్స్ మెంట్



,పెన్షన్లు ,అరోగ్యశ్రీకార్డు తథితరకార్డులు లబ్దిదార్లు కు అందిండమే ద్యేయంగా వాలెంటర్లీ పని చేయాలనీ కోరారు. ఈకార్యక్రమంలో మండల స్పెషల్ అపీసర్ కోటేశ్వరావు,తహశీల్దార్ గంగాదర్ రావు, విద్యాశాఖఅదికారణి సునీత,ఎమ్ పిడిఒ కరుణాకుమారి,పంచాయితీ విస్తరణా అదికారణి పద్మజ,వ్యవసాయ అదికారణి చంద్రావతి,అర్ ఐ రామారావు, కార్యదర్శిలు ప్రసన్నకుమార్ , శుభాష్ ,అచ్యుతరావు, లక్ష్మణరావు, తథితర్లు పోల్గోన్నారు.

## ఉల్లాసముగా ఆర్యవైశ్య సంఘ కార్తీక వనసమారాధన




అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్ధానిక వాసవి క్లబ్, వాసవి ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ శివారున గల కొండపల్లి.మురళీ మామిడి తోటలో కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమం అత్యంత ఉల్లాసముగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిధులుగా దేవస్థానం ఛైర్మెన్ ఐ.వి.రోహిత్,శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ప్రై.లి. ఎం.డి.మట్టే సత్య ప్రసాద్, సూర్య కమల దంపతులు, పేరూరి. గాంధీ తదితరులు హాజరైనారు.ముందుగా అక్కడ ఉన్న ఉసిరి చెట్టుకు పూజలు చేసారు.ఈ వన సమారాధన కార్యక్రమంలో పిల్లలకు,పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి ఉల్లాసముగా,ఉత్సాహముగా గడిపారు.అనంతరం మధ్యాహ్నం పసందైన విందు భోజనములు చేసారు. తదనంతరం ఆట,పాటలలలో గెలు పొందిన వారికి బహుమతులు ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోనల్ ఛైర్మెన్ దాసరి.రామ్ కుమార్,వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జొన్నాడ.రాజేష్,సెక్రటరీ బోనగిరి. శ్రీనివాస్, కోశాధికారి దాసరి.ప్రసన్న కుమార్ మరియు క్లబ్ సభ్యులు శ్రీ వాసవి ఆర్యవైశ్య సంక్షేమ సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 20 నుండి నవ శకం లబ్దిదారుల గుర్తింపు: కలెక్టర్ నివాస్



శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవశకం కార్యక్రమానికి ఈ నెల 20వ తేదీ నుండి లబ్దిదారుల గుర్తింపు ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. నవశకం కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు. నవశకం లబ్దిదారులకు వ్యక్తిగతంగా ప్రయోజనం కల్పించే కార్యక్రమంగా ఉంటుందని చెప్పారు. నవంబరు 20వ తేదీ నుండి డిశంబరు 20వ తేదీ వరకు లబ్దిదారుల గుర్తింపు కార్యక్రమం జిల్లాలో ఉంటుందని ఇందులో ప్రస్తుతం ఉన్న లబ్దిదారులకు అదనంగా మరింత మందికి ప్రయోజనం కల్పించుట జరుగుతుందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో ఇప్పటి వరకు లబ్దిపొందని వారిని చేర్చడం జరుగుతుందని చెప్పారు. నవ శకం కార్యక్రమం క్రింద అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను ఈ విధంగా తెలియజేసారు. బియ్యం కార్డు : నవ శకం కార్యక్రమంలో భాగంగో బియ్యానికి కొత్తగా కార్డును జారీ చేయడం జరుగుతుందన్నారు. బియ్యం కార్డు పొందుటకు కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10000/-, పట్టణ ప్రాంతాల్లో రూ.12000/-లు ఆదాయం కలిగినవారు, కుటుంబానికి 3 ఎకరాలు పల్లం భూమి లేదా 10 ఎకరాలు మెట్టు భూమి లేదా పల్లం, మెట్టు కలిపి 10 ఎకరాల వరకు ఉన్నవారు, విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు లోపల ఉన్నవారు (6 మాసాల సగటు) అర్హులన్నారు. కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరు కూడా ప్రభుత్వ సర్వీసులో లేదా ప్రభుత్వ పెన్షన్ దారులై ఉండకూడదని, కుటుంబానికి టాక్సీ, ఆటో, ట్రాక్టర్ మినహా నాలుగు చక్రాల సొంత వాహనదారులై ఉండకూడదని, కుటుంబంలో ఏ ఒక్కరు కూడా ఆదాయపు పన్నుచెల్లింపుదారులై ఉండకూడదని, కుటుంబానికి పట్టణ ప్రాంతాలలో 750 చ.అ.కు మించి నివేశన స్థలం కలిగి ఉండకూడదని తెలిపారు. వై.యస్.ఆర్ ఆరోగ్య శ్రీ : నవ శకంలో భాగంగా వై.యస్.ఆర్ ఆరోగ్య శ్రీ కార్యక్రమంలో మరింత మంది లబ్ధిపొందే విధంగా ప్రభుత్వం నిబంధనలు సడలించిందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిపొందుటకు బియ్యం కార్డు, వై.యస్.ఆర్. పెన్షన్ కానుక కార్డు, జగనన్న విద్య దీవెన, జగనన్న వసతి దీవెన కార్డుదారులందరూ అర్హులేనన్నారు. పల్లం భూమి 12 ఎకరాల కంటే తక్కువ, మెట్టు భూమి 35 ఎకరాల కంటే తక్కువ మరియు మొత్తం కలుపుకొని 35 ఎకరాలు మించకుండా భూమి కలిగిన కుటుంబాలు అర్హులేనని చెప్పారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల వరకు ఉన్నవారు కూడా అర్హులేనని ఆయన తెలిపారు. ఇందుకు తగిన ఆదాయ జీత ధృవీకరణ పత్రం జత చేయాలని చెప్పారు. రూ.5 లక్షల వరకు ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించిన వారు, పట్టణ ప్రాంతాలలో 3000 చదరపు అడుగులు (334 చ.గ.) విస్తీర్ణం వరకు ఆస్తి పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు/పింఛనుదారులు మినహా రూ.5 లక్షలకు లోబడి వార్షిక వేతనం పొందే ప్రభుత్వ, ప్రైవేటు విభాగాలలో పనిచేసే అవుట్ సోర్సింగు, కాంట్రాక్టు, పార్ట్ టైమ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, గౌరవ వేతనం పొందుతున్న ఉద్యోగులు, వ్యక్తి గతంగా ఒక కారు మాత్రమే వున్న కుటుంబాలు అర్హులేనని వివరించారు.

వై.యస్.ఆర్ పింఛను కానుక: నవ శకంలో పింఛను కానుకకు కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10000/- పట్టణ ప్రాంతాల్లో రూ.12000/-ల వరకు ఉన్నవారు, లబ్ధిదారునికి పల్లం భూమి 2.50 ఎకరాలు లేదా మెట్టు భూమి 5.00 ఎకరాల వరకు కలిగి ఉన్నవారు, విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు వరకు ఉన్నవారు(6 మాసాల సగటు), ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు/పింఛనుదారులు మినహా పారిశుధ్య కార్మికులు అందరు అర్హులన్నారు. కుటుంబంలో ఏ ఒక్కరు కూడా ఆదాయపు పన్నుచెల్లింపుదారులుగా ఉండకూడదని, కుటుంబానికి పట్టణ ప్రాంతాలలో 750 చ.అ.కు మించి నివేశన స్థలం కలిగి ఉండరాదని చెప్పారు. వృద్దాప్య ఫించను (రూ.2250లు నెలకు)కు 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు, జీవనోపాధి తక్కువగా ఉండటం, కుటుంబం లేదా బంధువుపై ఆధారపడకుండా నిరాశ్రయులైనవారు అర్హులుకాగా., చేనేత కార్మికుల పింఛను (రూ.2250లు నెలకు)కు 50 ఏళ్ళు పైబడిన నేతపనివారు, నిరాశ్రయులైనవారు అర్హులు. వితంతువుల పింఛను(రూ.2250లు నెలకు)కు వివాహ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు పైగా వయస్సు కలిగినవారు అర్హులని చెప్పారు.

## సత్యదేవుని సన్నిధిలో ఘనంగా పడి పూజ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో సత్యదేవుని పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ముందుగా పండితులు విఘ్నేశ్వరుని పూజ చేసి అనంతరం శ్రీ స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వ హించారు.సత్యదేవుని ప్రాంగణం అంతా సత్యదేవుని నామ కీర్తనలతో మారు మ్రోగింది.ఈ కార్యక్రమంలో ఈవో వి.త్రినాధరావు,ఛైర్మెన్ ఐ.వి. రోహిత్, ఏసి రమేష్ బాబు,ఏఈవో ప్రసాద్,పిఆర్వో కొండలరావు,దేవస్థానం అధికారులు,సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో సత్య దీక్ష పరులు పాల్గొన్నారు.

## సత్యదేవుడ్ని దర్శించిన రైల్వే అడిషనల్ జీఎం స్వామి



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని రైల్వే అడిషనల్ జీఎం కె.వి.యల్.స్వామి శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేసి శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.



మురళి నగర్ పిల్లలు మరియు మహిళా శాఖ గ్రంథాలయంలో లో అభివృద్ధి కమిటీ సభ్యులు లు జామి అన్నాజీ రావు, ఎస్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో పిల్లలకు మ్యూజికల్ చైర్, పరుగు పందెం లు నిర్వహించినారు గ్రంథాలయ అధికారి మురళి ,మరియు శ్రావణ్ కుమార్, ఎస్ మన్మధ, ఎం శంకర్రావు, భాష, ధనుంజయ్ నిర్వహణ లో పాల్గొన్నారు

## గ్రామ వాలంటీర్లకు ఇంటర్వ్యూలు



అనంతగిరి: అనంతగిరి ,మండలంలో ఇదివరకు వివిధ కారణాల వలన మిగిలి పోయిన గ్రామ వాలంటీర్ల పోష్టులకు గాను తే20 ,11, 2019 వ తారీఖున అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఇంటర్వ్యూ లు జరుగునని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని అని పత్రికా ముఖంగా అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివికుమార్, తెలియపరిచారు.



**ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, మానవతావాది, సర్వమానవ సహనశీలి, సరస్వతి జ్ఞానపుత్ర, ప్రవచనా చక్రవర్తి డాక్టర్ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ఈ నెల 21 నుండి 25 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గం.లకు సిరిపురం జంక్షన్‌లోనున్న గురజాడ కళాక్షేత్రం నందు ప్రవచనం అందించనున్నట్లు చాగంటి సత్సంగం ప్రధాన కార్యదర్శి పి.వి.రామాచార్యులు తెలియజేశారు.**

## మినిస్టరీ ఆఫ్ హౌసింగ్ సభ్యునిగా ఎంపి ఎంవీవీ సత్యనారాయణ



న్యూఢిల్లీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకి అరుదైన అవకాశం లభించింది. ప్రతిష్టాత్మక మినిస్టరీ ఆఫ్ హౌసింగ్,అర్బన్ అఫైర్స్ కన్సల్టేటివ్ కమిటి సభ్యునిగా ఆయన నియమితులయ్యారు .ఆ శాఖా మంత్రి హరదీప్ సింగ్ పూరి ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ భారత ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 14 మంది లోక్‌సభ, 7 రాజ్యసభ సభ్యులతో ఈ కమిటి కార్యకలాపాలు నిర్వహిస్తుంది.అయితే

వై ఎస్ ఆర్ పార్టీ నుంచి ఏకైక లోక్ సభ సభ్యలనుంచి విశాఖ ఎంపీ ఎంవీవీ ఈ కమిటి లో సభ్యునిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తమ అధినేత జగన్మోహనరెడ్డితో పాటు విజయ సాయిరెడ్డి, మిధున రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించనున్న గృహాల సంఖ్య ,రాయితీల పెంపు తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి ,రాష్ట్రా భివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## పారిశుధ్ద్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం



విశాఖపట్నం: జివిఎంసి జోన్-2, 3, మద్దిలపాలెం, జగదాంబ, సీఐటీయూ ఆఫీసు ల నందు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మద్దిలపాలెం జోన్. పరిధిలో ఉన్న వార్డులలో పనిచేస్తున్న, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు పి. వెంకట్ రెడ్డి, అధ్యక్షులు జి. సుబ్బారావు, మరియు నగర సిఐటియు అధ్యక్షులు కుమార్, మరియు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి, ముద్దాడ.ప్రసాద్, తదితర నాయకులు పాల్గొ న్నారు. రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, సుబ్బారావు. మాట్లాడుతూ జీవీఎంసీ పర్మినెంటు కార్మికులకు మిగిలిన బకాయి వేతనాలు, పెన్షన్లు వెంటనే చెల్లించాలి, పెండింగ్ సమస్యల పరిష్కారానికై దశలవారీగా పోరాటానికి సిద్ధం కండి అని అన్నారు. జీవీఎంసీ ఉద్యోగులు తమ భవిష్యత్తు ప్రయోజనం కోసం కాష్ లెస్ హెల్త్ కార్డ్ వస్తాయని అనేకసార్లు పోరాటాలు చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లింపుకు జివో సాధించుకున్నారు. సాంకేతిక కారణాల పేరు ఐదు నెలల జీతాలు చెల్లించకపోతే గుర్తింపు సంఘము గాని ప్రతిపక్ష గుర్తింపు సంఘాలు గా ఉన్న రెండు కార్మిక సంఘాలు ఉద్యోగుల జీతాలు మరియు మూడు సంవత్సరాలుగా ఉన్న పెండింగ్ సమస్యలను పట్టించుకోకుండా స్వలాభం కోసం ఇద్దరు ఒక్కటయ్యారు అని అన్నారు.

## వధువుకు మంగళసూత్రం, పట్టువస్త్రాలు అందజేత



నర్సీపట్నం: ఈ నెల 20న వివాహం చేసుకోబోతున్న నర్సీపట్నం మున్సిపాలిటీ 1వవార్డుకు చెందిన ప్రమీలారాణికి 1వ వార్డు మాజీ కౌన్సిలర్ మాకిరెడ్డి విజయకుమారి, అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో వధువుకు మంగళసూత్రం, పట్టువస్త్రాలు నర్సీపట్నం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ వార్డులోని వివాహం చేసుకోబోతున్న ఆడ పిల్లలకు ఈ రకంగా సహాయం చేయుడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చవద్దు



అనకాపల్లి .. తిరుమల తిరుపతి దేవస్థానంను వ్యాపార కేంద్రంగా అధికార యంత్రాంగం మార్చే ప్రయత్నాలను ఆపాలని నూకాంబిక దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీవారి సేవా సమితి అధ్యక్షులు కొణతాల వెంకటరావు కోరారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ప్రపంచంలోనే ఒక ధార్మిక హిందూ దేవాలయంగా కలియుగ ఆరాధ్య ధైవంగా శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రజలు కొలుస్తున్నారన్నారు.బాహు పేదవాడి నుండి ధనిక వర్గాల వరకు కూడా స్వామిని దర్శించుకుంటన్నారని అటువంటి పుణ్యక్షేత్రాని వ్యాపారసంస్థలు లాగా మారుస్తుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేసారు. .హిందువుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నారన్నారు. అధికారులు పాలకవర్గాలు తమ ఆధిపత్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని కనీస ఆలోచన లేకుండా సామాన్య భక్తులకే పెద్దపీట అని చెప్పి అక్కడ ధనిక రాజకీయ వర్గాలకే రెడ్ కార్పెట్ వేయడం దురదృష్టకరమన్నారు. స్వామివారి శీఘ్ర దర్శనం పేరుతో వంద రూపాయల టికెట్ 300/- రూపాయలు చేశారని, 25/- రూపాయలు లడ్డు ఇప్పుడు 50/- రూపాయలు చేస్తున్నారని, అద్దె గదులు భక్తులకు గంటల చొప్పున ఇస్తున్నారని, పిల్లాపాపలతో వచ్చినవారు గంటలు, రోజులు తరబడి క్యూలో వేచి ఉండవలసిన పరిస్థితి కనపడుతుందని చెప్పారు. ఒకేసారి అద్దె గదుల్ని రేట్లు పెంచేయడం సమంజసం కాదన్నారు. నందకం 600/- రూపాయల నుండి 1000/- రూపాయలకు, కౌస్తుభం పాంచజన్యం 500/- రూపాయల నుండి 1000/- రూపాయలకు పెంచారని తెలిపారు. అద్దె గదులు రేట్లు భక్తులకు భారంగా ఉంది కాబట్టి వెంటనే రేట్లు తగ్గించాలని డిమాండ్ చేసారు. 10,000 రూ.,.లు చందా దారులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పిచడం వలన సామాన్య భక్తుల పరిస్థితి ఏమిటాని ప్రశ్నించారు. ఈ విధంగా తిరుమలలో భక్తులు ప్రయోజనాల కంటే వ్యాపారమే కనపడుతుంది. పలహారం,భోజనం హెూటల్ లో రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. స్వామివారికి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా అధికారుల నిర్ణయాలు ఉన్నాయని భక్తులు విశ్వాసంతో,నమ్మకంతో స్వామివారికి మొక్కుబడులు రూపాయి నుండి కోట్ల రూపాయలు హుండీలో వేస్తున్నారు ఇప్పుడు హుండిలో వేసే రూపాయి కూడా ఆన్లైన్ ద్వారా పంపమంటున్నారు ఇది ఎంతో తీవ్రమైన చర్యఅని అన్నారు. ఒక భక్తుడు కష్టంలో ఉన్నప్పుడు స్వామిదగ్గరకు వస్తే నా కష్టాలు తీరుతాయి అని నమ్మకంతో విశ్వాసంతో మొక్కు రూపాంలో స్వామివారికి ముడుపులు,మొక్కు బడులు వేస్తారని మొక్కుకొని స్వామి దర్శనం అనంతరం హుండీలోనే చెల్లిస్తారన్నారు. ఈ విధంగా భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారన్నారు. అన్య మత ప్రచారం జరుగుతున్న అధికారుల నిర్లక్ష్యం ఖ కొ న్తు ల కొ ం, రా ్రష్ట ప్రజానికానికి కళ్ళకు కట్టినట్లు కనబడుతుందని హిందువులు కాకుండా వేరే మతస్తుల ఉద్యోగాలు చేస్తున్న వారి పట్ల ఉదాసీనంగా ఉన్నారని తిరుమలలో అధికారులు తీసుకున్న నిర్ణయాల్లో వ్యతిరేక భావం కనబడితే అటువంటిది ఏమీ లేవని ప్రకటనలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇకపైన అన్యమతస్తుల పట్ల హిందూ వ్యతిరేక భావం ఎవరు వ్యక్తం చేసిన అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని హిందూ ధర్మాన్ని కాపాడాలని తిరుపతి దేవస్థానాన్ని వ్యాపార కేంద్రంగా మార్చవద్దని అధికారుల్ని పాలకవర్గాన్ని వెంకటరావు డిమాండ్ చేసారు.

## ఇందిరాగాంధీకి ఘన నివాళ్లు



నర్సీపట్నం: మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నర్సీపట్నం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీసాల సుబ్బన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి రాజాన రాజు, చెల్లూరి రమణ, సిద్దా తదితరులు పాల్గొన్నారు.

# చక్కెర కర్మాగారాలకు పునర్ వైభవం తేవాలి: సీఎం



అమరావతి : సహకార చక్కెర కర్మాగారాలు, సహకార డెయిరీలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సహకార చక్కెర కర్మాగారాల పునర్ వైభవానికి సమగ్ర ప్రణాళిక తయారుచేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పనిచేస్తున్న కర్మాగారాలు, తిరిగి తెరవాల్సిన కర్మాగారాల విషయంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇప్పుడున్న పోటీని తట్టుకోవడానికి, లాభదాయకంగా నడపడానికి అవసరమైన చర్యలను అందులో పొందుపరచాలన్నారు. కర్మాగారాలను తాజా సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధిచేయడంతో పాటు ఉప ఉత్పత్తులు ద్వారా అవి సొంతకాళ్లమీద నిలబడ్డానికి అవసరమైన అన్ని ఆలోచనలు చేయాలని నిర్దేశించారు. చక్కెర సరఫరా చేసినందుకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వీలైనంత త్వరలో చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో నిర్దేశించిన విధంగా సహకార డెయిరీలకు పాలు పోస్తున్నందుకు ప్రతి లీటరుకూ రూ.4ల బోనస్ అమలుపైనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సహకార డెయిరీల బలోపేతం, రైతులకు మరింత లబ్ధి చేకూర్చే అన్నిరకాల చర్యలపైనా వీలైనంత త్వరగా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సీఎం ఆదేశించారు.

# వ్యవసాయ రంగంలో నానో టెక్నాలజీ ప్రయోజనకారి

## అంతర్జాతీయ వేధికపై గీతం ప్రొఫెసర్ ప్రసంగం




సాగర్‌నగర్‌: పరిశ్రమలు, ఔషధ రంగాలలో వినియోగిస్తున్న నానో టెక్నాలజీని ఇక పై వ్యవసాయ రంగంలోను సమర్ధంగా ఉపయోగించుకుని ప్రయోజనాలు పొంద వచ్చునని ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన మొదటి ఆగ్రో కెమికల్ కాంగ్రేస్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రవిభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.ఎస్. వేణుగోపాల్ చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. సొసైటీ ఆఫ్ పెస్టిసైడ్ సైన్స్ ఇండియా, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చి నిర్వహించిన ఈ అంతర్జాతీయ శాస్త్రవేత్తల సమ్మేళనంలో డాక్టర్ వేణుగోపాల్ నానో పెస్టిసైడ్స్ పై ప్రధాన ప్రసంగం చేశారు. నానో క్రిమిసంహారకాలను వ్యవసాయ రంగంలో ఉపయోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని, నీటిలో, భూమి పొరలలో త్వరగా కలవడంతో పాటు పంటలకు కీడు చేసే క్రిములను సమర్ధంగా తొలిగిస్తాయని ఆయన తెలిపారు.రసాయన క్రిమి సంహారకాలను ఎక్కువగా వాడటం వల్ల వచ్చే అనర్ధాలు నానో క్రిమ సంహరకాల వల్ల తగ్గించ వచ్చు నన్నారు.

తక్కువ మొత్తంలో ఉపయోగించిన నానో క్రిమి సంహరకాలు మెరుగైన ఫలితాన్ని ఇస్తాయని గీతం పరిశోధనలలో వెల్లడయిందని డాక్టర్ వేణుగోపాల్ ప్రకటించారు.

# గీతం విద్యార్ధుల ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్

## గ్రామాలలో స్వచ్ఛ సేవలు




సాగర్‌నగర్‌: కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఆనందపురం మండలంలోని పెద్ది పాలెం, పేకేర్, సిర్లపాలెం, ముకుందపురం, దబ్బంద గ్రామాలను దత్తత స్వీకరించి ఉన్నత్ భారత్ అభియాన్ స్వచ్ఛ సేవలను అమల చేస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ డైరక్టర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలిపారు.

40 మంది విద్యార్ధులు ఫాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్టర్ పి.మంజుశ్రీ, డాక్టర్ ఐ. బంగారురాజు ఆధ్వర్యంలో గ్రామాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతంగా అమలు జరిగేలా కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు.

స్థానిక పాఠశాలలలో పరిశుభ్రతతో పాటు బహిరంగ మల విసర్జన తదితర అంశాల పై అవగాహన కలిగించడం, ఉచిత వైద్య శిభిరాల నిర్వహణ ద్వారా గ్రామాలలో మార్పు తేగలిగామని ఆయన తెలిపారు.

విద్యార్ధులకు కోర్సు సిలబస్ సహితం గ్రామాలలో సేవలపై ప్రాధాన్యత ఇవ్వడంతో సామాజిక ప్రాజెక్టుగా దీనిని చేపట్టి విజయ వంతం చేశారని తెలిపారు. తద్వారా జిల్లా లో నూరు శాతం బహిరంగ మల విసర్జన లేని గ్రామాలుగా నిలిచాయని తెలిపారు. పెద్ది పాలెం గ్రామంలో వ్యర్థపదార్థాల శుద్ధి కేంద్రాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేసుకునే విధంగా తమ విద్యార్ధులు సహకరించారని ఆయన పేర్కొన్నారు.దత్తతకు స్వీకరించన గ్రామాలలో తమ సేవలు కొనసాగుతాయని తెలిపారు.

# కూలనున్న ఐదు లక్షల కొలువులు..

న్యూఢిల్లీ : నిర్మాణ రంగం కుదేలైన క్రమంలో రానున్న రెండేళ్లలో రియల్‌ఎస్టేట్ ఇతర అనుబంధ రంగాల్లో భారీగా కొలువుల కోత ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిర్మాణ రంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించే స్థితిలో ఆయా కంపెనీలు లేవని, తీవ్ర నగదు కొరత బ్యాంకింగ్, నిర్మాణ రంగాలకు సమస్యగా పరిణమిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. బ్యాంకులు నిర్మాణ రంగానికి తాజా రుణాలను నిలిపివేసే పరిస్థితి నెలకొనడం రియల్‌ఎస్టేట్ రంగంలో సమస్యలు పెరిగేందుకు దారితీస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు నిర్మాణం పూర్తయిన గృహాలు, వెంచర్లలో పలు యూనిట్లు విక్రయానికి నోచుకోకుండా ఉన్నాయని, భారీగా డిస్కౌంట్లను ఆఫర్ చేసినా ఇన్వెంటరీలు పేరుకుపోయాయని నిర్మాణ పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా రూ 1.8 లక్షల కోట్ల విలువైన నిర్మాణ రంగ ప్రాజెక్టులు నిలిచిపోయాయని ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ వెల్లడించింది. నిర్మాణ రంగంలో స్తబ్ధత కారణంగా దాదాపు ఐదు లక్షలకు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అంచనా వేసింది. ఇక సిమెంట్, స్టీల్ వంటి అనుబంధ పరిశ్రమలోనూ పెద్దసంఖ్యలో పరోక్ష ఉద్యోగాలపైనా ఈ ప్రభావం ఉంటుందని పేర్కొంది. గృహాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు వినియోగదారులు దూరంగా ఉండటంతో తక్కువ అద్దెలు, పెట్టుబడి పెరుగుదల ప్రతికూలంగా ఉంటుందనే అంచనాతో ఇన్వెస్టర్లు సైతం ఆస్తుల కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నారు. అమ్మకాలు తగ్గిపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డెవలపర్లు వడ్డీ, ఈఎంఐల చెల్లింపులో డిఫాల్ట్ అవుతున్నారని పారాడిగ్మ్ రియల్టీ మేనేజింగ్ డైరెక్టర్ పార్థ్ మెహతా చెప్పారు.



# గీతం నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు



సాగర్‌నగర్‌: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ , ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రాక్టీషనర్ ఇన్ క్రిటికల్ కేర్ కోర్సులో 2019-20 సంవత్స రానికి గాను పరిమిత సీట్లలలో ప్రవేశాలకు ఈ ఏడాది దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కనకలక్ష్మి తెలిపారు. అతి తక్కువ ఫీజుతో బిఎస్సీ నర్సింగ్ కోర్సు నిర్వహిస్తున్నామని, ఎమ్మెస్సీ నర్సింగ్‌లో ప్రవేశం పొందిన వారికి నెలకు 10 వేల రూపాయల ఉపకారవేతనం ఉంటుందన్నారు. విద్యార్ధులు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.gitam.edu ద్వారా దరఖాస్తులును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు నని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ కార్యాలయానికి అందే విధంగా పంపాల్సి ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 0891-2727236, 7331136730 లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

# ఇప్పుడు అపవిత్రుడిని అయ్యానా?

విజయవాడ : తన కంటే అమితంగా హిందూ మతాన్ని ప్రేమించే వాళ్లు ఎవరూ లేరని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. హిందూ మతంలోనే పుట్టాను.. హిందూ మతంలోనే చనిపోతాను అని స్పష్టం చేశారు. అయ్యప్ప మాల వేసుకొని చెప్పులతో నడుస్తున్నారంటూ తనపై వస్తున్న విమర్శలపై మంత్రి స్పందించారు. అనారోగ్య కారణాల వల్లే చెప్పులు వేసుకొంటున్నానని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా.. మాల వేసుకొని చెప్పులతో నడిచానన్నారు. ఆ పార్టీ నేత మురళీమోహన్ కూడా మాలలో చెప్పులు వేసుకొంటారన్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే చంద్రబాబు మాత్రం మతాన్ని రాజకీయానికి వాడుకుంటూ తనపై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. టీడీపీలో ఉన్నపుడు మాలలో పవిత్రంగా ఉన్న తాను.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన తర్వాత అపవిత్రుడినయ్యానా అని ప్రశ్నించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడంపై చంద్రబాబు చేస్తున్న విమర్శలపై మంత్రి స్పందించారు. ఇంగ్లీషు మీడియం అంశంపై రాద్ధాంతం చేయడం ఆయనకు తగదని హితవు పలికారు.



చంద్రబాబు కుమారుడు లోకేష్, మనవడు దేవాన్ష్ ఇంగ్లీషు మీడియంలో చదువుకోవచ్చు గానీ.. పేద పిల్లలు ఇంగ్లీషులో చదవకూడదా అని ప్రశ్నలు సంధించారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## రాష్ట్ర :మంత్రులు కురసాల కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ, మాలగుండ్ల శంకర్ నారాయణ



అమరావతి: పంట చేతికి రాకుండానే వేల కోట్ల నష్టం వాటిల్లిందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను మంత్రులు కురసాల కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ, మాలగుండ్ల శంకర్ నారాయణలు ఖండించారు. వెలగపూడి సచివాలయం లోని ప్రచార విభాగంలో మంగళవారం మంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అర్ధం లేనివని మంత్రులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నేత వేరుశెనగ పంట రైతు నుంచి మార్కెట్‌లోకి రాకముందే రూ.3 వేల కోట్లు, మొక్కజొన్న పంటలో రూ.600 కోట్లు నష్టం వాటిల్లిందని చేస్తున్న అబద్ధపు ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇప్పటికే రూ.3 వేల ధరల స్థిరీకరణ నిధి ద్వారా టమాట, ఆయిల్ ఫాం, సుబాబుల్, వేరుశెనగ, మొక్కజొన్న, ఉల్లి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. తమది రైతు ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసాను అమలు చేస్తున్నారని తెలిపారు. తొలిసారిగా కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. అవినీతికి తావు లేకుండా రైతు ఖాతాలోనే నేరుగా పెట్టుబడి సాయం జమ అవుతుందన్నారు. రైతు భరోసా పథకంపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హుల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులతో పాటు దేవాదాయ శాఖ భూములను కౌలుకు పండించుకుంటున్న వారికి పెట్టుబడి సాయం వర్తింపజేయాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా ద్వారా 45 లక్షల 20 వేల 616 రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇంకా లక్షా 20 వేల రైతు కుటుంబాల వివరాలు నమోదవ్వాల్సి ఉందన్నారు. డిసెంబర్ 15వ తేదీలోగా వారు తమ వివరాలు నమోదు చేసుకుంటే రైతు భరోసా అందిస్తామన్నారు. రైతులకు ఎక్కడ మద్దతు ధరకు ఇబ్బంది వచ్చినా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. వేరుశెనగ, మొక్కజొన్నపై ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం అర్ధం లేనిదన్నారు. మొక్కజొన్న కోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొక్క జొన్న రైతులకు బోనస్ ఇవ్వకుండా మోసం చేసిన గతంలో మోసం చేసిన గత ప్రభుత్వ పాలకులు నేడు పచ్చి అబద్ధాలను ట్వీట్ చేస్తున్నారని విమర్శించారు.

# ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలిస్తాం

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు

## ప్లాస్టిక్ వ్యర్ధాల నిర్వహణ కార్యక్రమం



విజయవాడ : 2020 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలిస్తామని రాష్ట్ర విద్యుత్, అటవీ, శాస్త్ర సాంకేతికశాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలకసంస్థ సంయుక్త భాగస్వామ్యంతో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ వ్యర్థాల నుంచి ఇటుకలు, టైల్స్ తయారు చేయడాన్ని మంత్రి బాలినేని పరిశీలించారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ కంపెనీలకు తరలించే వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేంధించేలా చర్యలు చేపట్టినట్లు, 110 మున్సిపాలిటీల్లో ఈ విధానం తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ నిషేధించాలన్న కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, 44 మున్సిపాలిటీల్లో మెటీరియల్ రికవరీ సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**నగరంలో 7 చోట్ల కంపోస్ట్ పాయింట్స్ ఏర్పాటు**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో గత కొన్నేళ్లుగా డంపింగ్ యార్డు సమస్యగా మారిందని స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. నగరంలో ప్రతిరోజు 500 టన్నుల చెత్త ఉత్పత్తి అయి ఈ యార్డుకు చేరుతుందని, పనికిరానీ వ్యర్థాలను సిమెంట్ కంపెనీలకు పంపడం ద్వారా కొంత వరకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి మార్చడం లో గత ప్రభుత్వం విఫలమైందని, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, నగర పాలక సంస్థ, అల్ట్రాటెక్ సిమెంట్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. గుంటూరు, పాతపాడు ప్రాంతలకు డంపింగ్ యార్డు తరలించేలా చర్యలు చేపడుతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నగరంలో 7 చోట్ల కంపోస్ట్ పాయింట్స్ ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ ప్రసన్న కుమార్ వెల్లడించారు. 250 టన్నుల పొడి చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ చేపట్టామని, అల్ట్రాటెక్ సిమెంట్ వారు 50 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను ఫ్యూయల్ గా వినియోగించుకునేలా ఒప్పందం కుదిరిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన బంగారం

## రూ 39,028కి చేరిన పసిడి

ముంబై : అంతర్జాతీయ మార్కెట్‌లో యల్లోమెటల్ ధరలు పెరగడంతో దేశీ మార్కెట్‌లోనూ పసిడి ప్రియమైంది. మంగళవారం పదిగ్రాముల బంగారం రూ 328 పెరిగి రూ 39,028 పలికిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ వెల్లడించింది. మరోవైపు వెండి ధర సైతం రూ 748 ఎగబాకి కిలో రూ 45,873కు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్‌బంగారం 1470 డాలర్లకు చేరిందని, అమెరికా-చైనా వాణిజ్య ఒప్పంద చర్చలపై ఆధారపడి పసిడి తదుపరి ధరలు ప్రభావితమవుతాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ తపన్ పటేల్ చెప్పారు.

# వాహనదారులకు శుభవార్త

టోల్ ప్లాజా వద్ద వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర రోడ్డు రవాణా సంస్థ డిసెంబర్ 1వ తేదీ నుంచి ఫాస్ట్‌ట్యాగ్‌ను అందుబాటులోకి తీసుకు వస్తోంది. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా 400 టోల్ ప్లాజాల వద్ద దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. త్వరలో అన్ని టోల్ ప్లాజాలలో అమలు చేయనున్నారు. అంటే ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు ఉంటాయి. ఫాస్ట్‌ట్యాగ్ అనేది వాహనం యొక్క విండ్ స్క్రీన్ పైన అతికించిన, రీలోడ్ చేయగల ట్యాగ్. దీంతో టోల్ గేట్ వద్ద టోల్ ఛార్జీ ఆటోమేటిక్‌గా డిజిటల్ రూపంలో డిడక్ట్ అవుతుంది. టోల్ ప్లాజాల వద్ద ప్రయాణీకులు ఆగి టోల్ చెల్లించవలసిన అవసరం ఉండదు. దీంతో సమయం ఆదా అవుతుంది. ట్రాఫిక్ నిలిచిపోకుండా ఉంటుంది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com